# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**

30 ఏళ్ల ప్రస్థానం · వార్త 30 వార్షికోత్సవం · 1996 - 2026


## అక్కడ ఉపాధిహామీ

# పనుల తీరేవేరు..

**కూలీలకు పనులుకల్పించక జెసీబీ యంత్రాలతో పనులుచేస్తున్న వైనం..**

**ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఉపాధి సిబ్బంది.**

పెద్దపంజాణి, మే 31 ప్రభాతవార్త:



జెసిబి యంత్రాలతో పనులుచేయించన దృశ్యం

కూలీలకు 125రోజులపాటు పనినికల్పించాల్సిన ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులు కల్పించక యంత్రాలతో పనులుచేసి అక్రమాలకు తెరలేపుతున్న వైనమిది. ఏకంగా ఆదివారం సెలవురోజు కావడంతో జెసీబీ యంత్రంతో చెరువులో ఉపాధిహామీపనులు చేపట్టినవైనం వెలుగు చూసింది. ఈ సంఘటన మండలంలోని పెద్దరికుంట పంచాయతీ చిన్నారికుంట చెరువులో చోటుచేసుకుంది. ఈ విషయం తెలియడంతో స్థానికులు ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. ఉపాధిహామీ సిబ్బంది తమను ఎవరుఏమిచేస్తారులే అనేధీమాతో ఆధివారంనాడు చిన్నారికుంట చెరువులో కూలీలు చేయాల్సిన పనిని కూలీలస్థానంలో జెసీబీపెట్టి చేయించాడని తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. ఓ పక్క కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకాన్ని పారదర్శకంగా చేపట్టాలని ఉపాధికూలీల హాజరు, కూలీల ఫేస్‌రికగ్నేజషన్‌ను సైతం తీసుకుని వారికిపనులు కల్పించాలని తద్వారా ఉపాధిహామీలో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదని ఆదేశించారు. అయితే ఈ పథకంలో లొసుగులు తెలిసిన క్షేత్రస్థాయి ఉపాధిసిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించి చెరువులో జెసీబీ యంత్రాలతో 85అడుగుల వెడల్పు 125అడుగుల పొడవు మేరా చిన్నపాటి కుంటను తవ్వించేసాడు. ఇక రేపోమాపో ఉపాధి కూలీలచేత ఆ పనలుకు పనిమొట్లు అందించి పైపైమెరుగులు దిద్దితే పనిపూర్తీ అయినట్లేలెక్క. ఈ వ్యవహారంలో క్షేత్రస్థాయి సిబ్బందికి ఎంతముడుతుందో తెలియదుగానీ ఈ తరహా అక్రమాలకు పాల్పడడంపై పంచాయతీ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులు విచారించి సంబంధిత బాధ్యులపై చర్యలుతీసుకోవాల్సిన అవసరంఉందని ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులు కల్పించేలా చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## గరుడ వాహనంపై చిద్విలాస శ్రీనివాసుడు



చంద్రగిరి, మే 31 ప్రభాతవార్త:

శ్రీ మహావిష్ణువు నిత్య వాహనమైన గరుడ వాహ నంపై చిద్విలాసంతో శ్రీనివాసుడు తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయం లో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని గరుడ వాహనసేవ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చి గరుడవాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, దిలీప్‌కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంటలపై ఆగని గజదాడులు

**- ముప్పుతిప్పలు పెడుతున్న జంట ఏనుగులు .. లబోదిబోమంటున్నరైతన్నలు !!**

**- కుంకీ ఆపరేషన్‌ను అధికారులు చేపట్టరా..? - పలమనేరు క్యాంప్‌లోనే ఆరు శిక్షణ ఏనుగులు !!**



రామకుప్పం మండలంలో సంచరిస్తున్న జంట ఏనుగులు

కుప్పం, మే 31 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలంలో జంట ఏనుగులు విజృంభిస్తున్నాయి. చీకటిపడితే చాలు అటవీ సమీప ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలపై దాడులు చేయడంతో పాటు పంటలను సైతం ధ్వంసం చేస్తున్నాయి. సుమారు గత నెలరోజులుగా జంట ఏనుగులు పంటలపై దాడులు చేస్తూ రైతులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. ననియాల, 89 పెద్దూరు, వీర్నమల తదితర ప్రాంతాల్లో ఈ జంట ఏనుగులు సంచరిస్తున్నాయి. రైతులు సాగు చేస్తున్న వరి, రాగి, టమోటా, అరటి, మొక్కజొన్న, జొన్న పంటలను తొక్కేస్తున్నాయి. వీటికితోడు అక్కడక్కడా రైతుల పొలాల్లో ఉన్న వ్యవసాయ పరికరాల సంగతి సరేసరి. ఇక ఏడాదికోసారి మామిడి పంటకు మంచి ధరలు వస్తాయని సాగు చేస్తున్న మామిడి రైతులకు సైతం జంట ఏనుగుల దెబ్బ పడుతోంది. పలుప్రాంతాల్లో జంట ఏనుగులు మామిడి కాయలను నేలరాల్చడం, చెట్లను విరిచేయడం జరుగుతోంది. దారి మళ్లింపు చర్యలు విఫలం : జంట ఏనుగులను దారి మళ్లించేందుకు గాను అటవీ అధికారులు చేపడుతున్న చర్యలు విఫలమవుతున్నాయి. పగలంతా అటవీ ప్రాంతంలో మకాం పెట్టే ఏనుగులు చీకటిపడితే పంటలపై పడుతున్నాయి. అటవీ అధికారులు ఏనుగుల దారి మళ్లింపుకు ట్రాకర్లతో వాటి కదలికలు కనిపెడుతూ మరో పక్క బాణసంచా పేలుళ్ల జరిపినా ఫలితం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అటవీ ప్రాంతంలో నిర్మించిన ట్రెంచ్‌లు (కందకాలు)పలుచోట్ల పూడి పోగా సోలార్ ఫెన్సింగ్ చాలాచోట్ల వృధాగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అటవీ అధికారులు కొత్తగా ఏర్పాటుచేస్తున్న హ్యాంగ్ సోలార్ ఫెన్సింగ్ కొన్నిచోట్ల ఉన్నా వాటిని సైతం ఏనుగులు లెక్కచేయడం లేదని తెలుస్తోంది.

కుంకీ ఆపరేషన్‌కు చర్యలు చేపట్టరా : సుమారు నెల రోజులుగా పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో అటవీ ఉన్నతాధికారులు ఏనుగుల దారి మళ్లింపుకు కుంకీ ఆపరేషన్ చేయిస్తే ఫలితం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. పలమనేరు ఎలిఫెంట్ క్యాంప్‌లో కర్ణాటకనుంచి వచ్చిన నాలుగు శిక్షణ పొందిన కుంకీ ఏనుగులతో పాటు కుప్పం నియోజకవర్గం ననియాల ఎలిఫెంట్ క్యాంప్‌లో ఉండే మరో రెండు శిక్షణ ఏనుగులు ఉన్నాయి. కాగా వీటికి ప్రస్తుతం డిఎన్ఎ టెస్టులు జరుపుతున్నట్లు అటవీ అధికారులు



ఏనుగులు తొక్కేసిన వరిపంట ఫైల్‌ఫోటో

పేర్కొంటున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు పలమనేరు కా ్యంప్‌లో ఉన్న కుంకీ ఏనుగులను కుప్పంకు తెప్పించి జంట ఏనుగుల దారి మళ్లింపుకు కు ంకీ ఆపరేషన్ చేయిస్తే రైతులకు జంట ఏనుగుల బెడద తప్పుతుందేమో. మరి అటవీ శాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## రోడ్డు ప్రమాదంలో స్విమ్స్ డాక్టర్ మునుస్వామి మృతి



తడ, మే 31 ప్రభాతవార్త:

సిమ్స్ హాస్పిటల్ డాక్టర్ కారణ మునుస్వామి యాదవ్ ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తిరుపతి నుండి స్వగ్రామం మాంబట్టు గ్రామంలో దేవాలయంలో జరుగుతున్న పూజలో పాల్గొనేందుకు వెళుతున్న సమయంలో మాంబట్టు అపాచీ రోడ్డు వద్ద ప్రయాణిస్తున్న కారు వెనుక టైరు పగలడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వేప చెట్టును కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న డాక్టర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సిమ్స్ హాస్పిటల్ నందు ఎందరికో వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడిన మునస్వామి డాక్టర్ మరణం స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లోనే కాక తిరుపతి జిల్లాలో నిరుపేదలకు అనారోగ్య సమస్య తలెత్తితే మొదటగా గుర్తొచ్చే పేరు మునుస్వామి డాక్టర్. సోమవారం ఉదయం 9 గంటలకు వారి స్వగ్రామం తడ మండలం మాంబట్టు నందు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

**నివాళులర్పించిన ఎమ్మెల్యే విజయశ్రీ..**



డాక్టర్ మునుస్వామి మృతిదేహానికి సూళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఘన నివాళులర్పించారు. డాక్టర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు వైద్యరంగంలో డాక్టర్ మునస్వామి ఎనలేని సేవలు అందించారని ఎందరో ప్రాణాలను నిలబెట్టారని ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరించే గొప్ప మనసున్న వ్యక్తిని కోల్పోవడం వైద్య రంగానికి తీరని లోటని ఎమ్మెల్యేవిజయశ్రీ పేర్కొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ముఠాపై దాడి

**నలుగురు నిందితులు అరెస్టు, పరారీలో ఇద్దరు నిందితులు  చిత్తూరుకు చెందిన దంపతుల ఆధ్వర్యంలో పరీక్షలు**

చిత్తూరు (బంగారుపాళ్యం) మే 31 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో సోమవారం పోలీసులు గర్భస్థ, శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ముఠాపై దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు నిందితులు పట్టుబడగా ఈ కేసుకు సంబంధించి మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. చిత్తూరుకు చెందిన బి. సుధాకర్ రెడ్డి, బి. పద్మావతి దంపతులు ఈ లింగ శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. వివరాలిలా ఉన్నాయి. బంగారుపాళ్యం మండల పరిధిలోని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్ బంగారుపాళ్యం పోలీసులకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఫిర్యాదు చేశారు. వైద్య శాఖ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు రంగంలో దిగిన పోలీసులు బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట పంచాయతీ చంద్రశేఖర పురం గ్రామంలోని నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్దకు చేరుకున్నారు. నిర్మాణంలో ఉన్న ఇంట్లో నుండి అలికిడులు వినిపించడంతో పోలీసులు ఇంటిపై ఒక్కసారిగా దాడి చేశారు. ఈ సమయంలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో కొంతమంది వ్యక్తులు ఒకరిద్దరూ గర్భిణీ స్త్రీలను లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు వచ్చిన విషయం గుర్తించిన వెంటనే అక్కడి నుండి ఓ వ్యక్తి పారిపోయాడు. అక్కడ ఉన్న మిగిలిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి చిత్తూరు, బంగారు పాల్యం ప్రాంతాలకు రప్పించి ఈ ముఠా సభ్యులు గర్భిణీ స్త్రీలను తప్పించి గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఒక్కొక్కరి నుండి రూ.10 వేలు తీసుకునే వారిని తెలిసింది. ఈ కేసులో పోలీసులు 14 మంది బాధితులను గుర్తించి వారి నుండి వాగ్మూలాలు తీసుకున్నారు. చిత్తూరు నగరంలోని మిట్టూరు ప్రాంతంలో నివాసం ఉంటున్న దంపతులు బి. సుధాకర్ రెడ్డి, బి. పద్మావతిలు ఈ రాకెట్ లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తేలింది. అలాగే నాగరాజు అనే వ్యక్తి ఫోన్ల ద్వారా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి గర్భిణీ స్త్రీలను చిత్తూరు, బంగారుపాళ్యం పరిసర ప్రాంతాలకు తీసుకుని వచ్చేవాడిని పోలీసులు గుర్తించారు. అలాగే చిత్తూరు ఎస్టేట్ ప్రాంతానికి చెందిన జ్యోతి అనే మహిళ గర్భిణి స్త్రీలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసేదని తేలింది. అలాగే జ్యోతిష్ అనే ఆటో డ్రైవర్ గర్భిణీ స్త్రీలను బంగారుపాళ్యం మండలంలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే



గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న బంగారుపాళ్యం పోలీసులు.

స్థలానికి ఆటోలో తీసుకెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. అలాగే బంగారుపాళ్యం కెజి సత్రం చీకురుపల్లి గ్రామంకు చెందిన జ్యోతీష్ అనే ఆటో డ్రైవర్ గర్భిణీ స్త్రీలను తన ఆటోలో బంగారుపాళ్యం నుండి చంద్రశేఖరపురం వద్దకు తరలించినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు ఈ కేసులో బి.పద్మావతి, వి.జ్యోతి, జ్యోతీష్, ఎన్.రోమన్‌కుమార్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. అలాగే ఈ కేసులో బి.సుధాకర్‌రెడ్డి, నాగరాజు అనే వ్యక్తులు పరారీలో వున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు నలుగురు నిందితులను అరెస్టు చేసి వివరాలను బంగారుపాళ్యం పోలీసులు ఈ కేసు వివరాలను వెల్లడించి మిగిలిన ఇద్దరు నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఈ సమావేశంలో బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు, ఎస్ఐ ప్రసాద్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వరుణదేవుడు పలకరించగా

# పులకించిన గరుడుడు

## వేడుకగా మలయప్ప వాహనసేవ

తిరుమల, మే 31ప్రభాతవార్తప్రతినిధి:

నిండుపున్నమివేళ ఆదివారం సాయంత్రం వరుణదేవుడు జోరున పలకరించగా గరుడునిపై ఏడుకొండలదేవుడు ఊరేగాడు. జ్యేష్టపూర్ణిమ సందర్భంగా ఆదివారంరాత్రి వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామి గరుడవాహనంపై అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చాడు. 108 దివ్యదేశాల్లో గరుడసేవ ఎంతోవిశిష్టత సంతరించుకుంది. ఆదివారం సాయంత్రం మలయప్పస్వామి వాహనమండపం వద్ద గరుడవాహనంపై ఆలయ అర్చకులు వేంచేపుచేశారు. అక్కడ వేదమంత్రాలు, కర్పూరహారతులు సమర్పించిన అనంతరం భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారి వాహనం ఊరేగింది. ఆలయ మాఢవీధుల్లో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులిచ్చారు. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ అర్చకులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న.. విద్యా భారం

**పాఠశాలల్లో పుస్తకాల దందా.. పాఠశాలలోనే కొనాలంటూ నిబంధన**

**మధ్యతరగతి కుటుంబాల్లో గుబులు .. యూనిఫాం, బెల్టుల పేరుతోనూ వసూళ్లు**




తిరుపతి విద్య మే 31 ప్రభాత వార్త

తల్లిదండ్రుల ఆశ... ఆశయాలే కార్పొరేట్ పెట్టుబడి... పిల్లల భవిష్యత్ కోసం వారు పడే తపన వారికి కాసులు కురిపిస్తోంది. తల్లిదండ్రుల బలహీనతలపై కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలు ప్రతి ఏటా వ్యాపారం చేస్తున్నాయి. కార్పొరేట్ ముసుగులో కోట్లు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయి. నియంత్రించాల్సిన పాఠశాల విద్యాశాఖ చోద్యం చూస్తోంది. వేసవి సెలవుల అనంతరం ఉమ్మడి జిల్లాలో జూన్ రెండవ వారంలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అదే సమయంలో తల్లిదండ్రులు ఖర్చులకు భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ, టీ షర్ట్ అంటూ అందినకాడికి దోచుకుంటున్నాయి. గతంలో విద్యార్థులకు కావలసిన పుస్తకాలు తమకిష్టమొచ్చిన చోట కొనుక్కునేవారు. అయితే ఇప్పుడు పాఠశాలల పంథా మారింది. పెన్సిల్ దగ్గర నుంచి పుస్తకాల వరకు, బెల్టు, టై, షూస్, యూనిఫాం అన్నీ ఆయా స్కూళ్లలోనే కొనాలి. దీంతో ఒక్కో విద్యార్థికి సుమారు రూ.10వేలకు పైనే ఖర్చు కళ్ల ముందు కనిపిస్తోంది. ఇక ఏటా పెరుగుతున్న ఫీజులతో అదనంగా మరో రూ.20వేలు కట్టాల్సి వస్తోంది. ఒకవైపు ఆర్థికభారం.. మరోవైపు పిల్లల భవిష్యత్ కోసం మోనంగానే ముందడుగు వేస్తున్నారు. మద్యతరగతి కుటుంబాలది ఎపుడూ లెక్కల పుస్తకమే. ఒకవైపు నిత్యావసర సరుకులు, వివిధ అవసరాల ఖర్చులు అడ్డగోలుగా పెరిగిపోయాయి. దీంతో ఏనెలకనెల ఆదాయ, వ్యయాలపై ఆచితూచీ అడుగులు వేస్తున్నవారిలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, రోజువారీ కూలీలు ఉన్నారు. అయితే చదువు విషయంలో పేద, మధ్య తరగతి అనే భేదం లేదు. సాధారణ రోజుల్లోనే ఒక చిన్న కుటుంబం ఇంటి అవసరాలకు సుమారు రూ. 20 నుంచి 30వేల వరకు ఖర్చవుతోంది. ఈనెలలో ఇంటి అవసరాలను పక్కన పెడితే కేవలం పిల్లల స్కూలు కోసం ఒక్కొక్కరికీ సుమారు రూ.30వేల నుంచి రూ.50వేల వరకూ ఖర్చుచేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

**ప్రైవేటు పాఠశాలల ఇష్టారాజ్యం**

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అత్యధికంగా ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఇఒ కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయాల్లో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి వ్యాపారం చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. నిబంధలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూ ఇలా అన్నీ తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తున్నాయి, దీంతో తప్పక అడిగిన డబ్బులు చెల్లించి షాపుల్లో మాదిరిగా ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేవు. తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా, ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది.

**నోరెళ్లబెడుతున్న తల్లితండ్రులు**

సామాన్య కుటుంబాల వారు జూన్ వస్తుందంటేనే భయపడి పోతున్నారు. అమ్మో.. అంటూ నోరెళ్లబెడుతున్నారు. నెలరోజుల వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్దమవుతుండగా, వారి తల్లిదండ్రులు మాత్రం ఆర్థిక ఇబ్బందులను అధిగమించేది ఎలా అని ఆలోచన చేస్తున్నారు. అడ్మిషన్ నుంచి పిల్లలు తరగతి గదిలో అడుగుపెట్టేంత వరకు వారికి లెక్కల పరీక్షే. ఖర్చుల మోతే. జూన్ నెల అనగానే పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఖర్చుల దడ పుడుతోంది. ఏటికేడు పెరుగుతున్న స్కూలు, కాలేజీ ఫీజులు, అందుకు అయ్యే ఇతర వ్యయం తలచుకుంటేనే గుండె గుభేల్ మంటోంది. జూన్ నెలలో విద్యా సంస్థల పునఃప్రారంభంతో ఖర్చు తడిసి మోపెడవుతోంది.

# కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం



వరదరాజ స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

కాణిపాకం, మే 31 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో ఆదివారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

**ఘనంగా పున్నమి గరుడసేవ**

శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సత్యనారాయణ వ్రతంను నిర్వహించగా రాత్రి గరుడసేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# ఇక గంజాయి బ్యాచ్ అటకట్టు

## పోలీసుల చేతిలో అధునాతన పరికరం : సిఐ

పలమనేరు, మే 31 ప్రభాతవార్త:




పలమనేరు పరిసర ప్రాంతాల్లో ఇక గంజాయి బ్యాచ్ అటకట్టిస్తామని సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మాదక ద్రవ్యాల వాడకంపై అధునాతన పరికరం (టెస్టింగ్ కిట్) పోలీసుల చేతికి వచ్చిందన్నారు. గతంలో మాదకద్రవ్యాలు వాడిన వారికి రక్త పరీక్షలు ఉండేవని ఐతే నేడు పోలీస్‌శాఖకు వచ్చిన అధునాతన పరకరంతో కేవలం రెండు నిమిషాల్లోనే ఫలితం తేలిపోతుందన్నారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ సూచనలతో ఆదివారం పలమనేరు బంగారుపాళ్యం మండలాల్లో గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తుపదార్థాల వాడకంపై పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. దాదాపు 10 మందికి పరీక్షలు చేయగా నెగటివ్ రిపోర్టు వచ్చిందని తెలిపారు.
ఒక వేళ పాజిటివ్ రిపోర్టు వస్తే మరో సారి బ్లడ్ శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపుతామని వివరించారు. ల్యాబ్ రిపోర్టులో వాస్తవమేనని తేలితే కఠిన చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు రహస్యంగా మత్తు పదార్థాలు వాడుతున్నట్లు తెలిస్తే పోలీసుల దృష్టికి తేవాలని అటువంటి వారికి ముందుగా కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు. మాట వినకపోతే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఎవరైనా నాలుగు ఐదు రోజుల ముందు కూడా మత్తుపదార్థాలు సేవించినా పరీక్షల్లో తెలిసిపోతుందన్నారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా వుండాలని లేదంటే భవిష్యత్తు చేజేతులా నాశనం చేసుకుంటారని హెచ్చరించారు. ఎస్ఐలు లోకేష్, స్వర్ణతేజ పాల్గొన్నారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

### మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వ ప్రోత్సాహం

ఎమ్మెల్యే అమర్ నాథ్ రెడ్డి

వి.కోట, మే 31 ప్రభాతవార్త



ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మహిళలందరూ ఆర్థికంగా రాణించాలని ప్రతి మహిళ ఓ పారిశ్రామికవేత్తగా ఎదగాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన వి.కోటలో అమ్యాక్స్ సీఈవో దశరథ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 29వ అమ్మాక్స్ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రభుత్వం అందించే సంక్షేమకార్యక్రమాలతో పాటు ప్రైవేట్ పరస్పర సహకార సంఘాల ద్వారా పొదుపులని అలవాటు చేసుకుని మహిళలు మరింత ఆర్థిక వృద్ధిలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సంస్థ లో షేర్లకు సంబంధించి డివిడెంట్ చెక్ రూ.33.44 లక్షల రూపాయల తో పాటు గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు సంస్థ తరఫున మెడల్స్ మరియు రూ.15.78 లక్షల రూపాయల నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో దశరథరెడ్డి తో పాటు ఏపీ వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, మండల అధ్యక్షులు రాంబాబు, నాయకులు ఈశ్వర్ గౌడ్, ధీరజ్, సతీష్, జనార్దన్ రెడ్డి, కోదండ రెడ్డి, సంస్థ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

– ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, మే 31 ప్రభాతవార్త



ఆర్టీసీ సంస్థలో 35 ఏళ్ల పాటు అంకిత భావంతో సేవలు అందించిన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు బాబు, గంగప్ప, సుబ్బయ్యల పదవీవిరమణ కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలకు మెరుగైన రవాణా అందించడంలో వారు చూపిన కృషిని అభినందించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిఎం టికె స్వామి, కడ సభ్యురాలు సుగుణమ్మ, మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు

### జాయింట్ కలెక్టర్ పనితీరుపై ఐవిఆర్ఎస్ సర్వే

కుప్పం, మే 31 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఓ పక్క ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, మంత్రుల పనితీరుతో పాటు మరో పక్క ఉన్నతాధికారుల పనితీరుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటోంది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పనితీరుపై ప్రభుత్వం ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా సర్వే నిర్వహిస్తోంది. జాయింట్ కలెక్టర్ బాగా పనిచేస్తున్నారా లేదా అని సర్వేలో పేర్కొంటూ ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నారు.

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

– కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను తన, అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని క్షేత్ర స్థాయిలో సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

### నేడు పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరుహెల్త్, మే 31 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని సత్వరం పరిశీలించి చర్యలు తీసుకుంటారని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

### మాదకద్రవ్యాలు వినియోగిస్తూ పోలీసులకు పట్టుబడిన నలుగురు

చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:

జిల్లాలో మాదకద్రవ్యాలు వినియోగిస్తూ నలుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆదివారం 25 ప్రాంతాల్లో భారీ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా 110 మందికి డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించగా నలుగురు వ్యక్తులు డ్రగ్స్ వినియోగించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ డ్రగ్ డిటెక్టివ్ కిట్స్ సహాయంలో నిర్వహించిన పరీక్షల్లో పూతలపట్టు, గంగవరం, పాలసముద్రం, విజయపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకక్కొరు డ్రగ్స్ వినియోగించినట్లు నిర్ధారణ అయ్యింది. డ్రగ్ డిటెక్టివ్ కిట్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన నలుగురు వ్యక్తులకు పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. అలాగే ఐరాల మండలం గుండ్లపల్లి ఎస్టీ కాలనీలో గన్‌పౌడర్‌తో పాటు పేలుడు పదార్థాల తయారీకి వినియోగించే ముడి పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే ఈ ఆపరేషన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 25 ప్రాంతాల్లో రౌడీ షీటర్లు, గంజాయి కేసుల్లో గతంలో పట్టుబడిన నిందితులు, అనుమానిత వ్యక్తుల నివాసాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

### దార మనోహర్ సేవలు మరువరానివి

మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి

రైల్వేకోడూరు రూరల్, మే 31 ప్రభాతవార్త ::



అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలో సెక్రెటరీ పని చేస్తూ పదవి విరమణ పొందుతున్న దార మనోహర్ సేవలు మరువరానివని రైల్వే కోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి అన్నారు. ఆదివారం బుడుగుంట పల్లి పంచాయతీ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో దారా మనోహర్ పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని మనోహర్ వృత్తిరీత్యా ఎన్నో సేవలను అందించారని వృత్తినే దైవంగా భావించి ఉద్యోగం పట్ల న్యాయంగా పనిచేశారని ఆమె కొనియాడారు. అనంతరం దార మనోహర్ ఆయన సతీమణిలను ఘనంగా పూలమాలలతోనూ, శాలువలతోనూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ కమిటీ సెక్రటరీ బాబు, ఎమ్మిగనూరుకు చెందిన చంద్రమోళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మతం నాగరాజు, భారతి, విద్యావతి, మనోజ్, కిరణ్, విజయ్, ప్రసాద్, కొండయ్య రాజు, కార్తీక్, నాగరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మండల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు.

చిట్వేలి, మే 31 ప్రభాతవార్త:



శాంతిభద్రతల పరిరక్షణ మరియు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మండల పరిధిలో 2026 జూన్ 1 వ తేదీ నుండి జూన్ నెల 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌కు సంబంధించిన నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని స్థానిక ఎస్సై వినోద్ కుమార్ ఆదివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖ నుండి ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలుమరియుఇతర గుంపులుగా నిర్వహించే కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. పై నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ప్రజల శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా తీసుకున్నప్రజలు సహకరించాలని ఎస్సై వినోద్ కుమార్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### ఉచిత క్యూలైన్లలో అల్పాహారం,మజ్జిగ పంపిణీ ప్రారంభం

కాణిపాకం, మే 31 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఉచిత క్యూలైన్లలోపి భక్తులకు ఉచితంగా అల్పాహారం, అన్నప్రసాదం, మజ్జిగ పంపిణీ కార్యక్రమంను ఆదివారం ఆలయ అధికారులు ప్రారంభించారు. కాణిపాకం ఆలయ దర్శనార్థం ప్రతి రోజూ వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. అలాగే గత కొద్ది రోజులుగా ఆలయంలో వేసవి రద్దీ కొనసాగుతోంది. ఈనేపథ్యంలో స్వామివారి దర్శనానికి భక్తులు ఉచిత క్యూలైన్లలో సుమారు మూడు, నాలుగు గంటల పాటు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే శీఘ్రదర్శనం, అతి శీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం గంటల కొద్ది క్యూలైన్లలో వుంటున్నారు. దీనితో క్యూలైన్లలో భక్తులు ఆకలి దప్పులతో ఇబ్బందులు పడకుండా వుండేందుకు ఉచిత దర్శనం క్యూలైన్లలో వేచి వుండే భక్తులకు తిరుమల తరహాలో అల్పాహారం, సాంబారు అన్నం, మజ్జిగ, త్రాగునీరును పంపిణీ చేసే కార్యక్రమంను ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆదివారం ప్రారంభించారు. అలాగే ఆలయంలో దర్శనాల బ్రేక్ సమయంలో అన్ని క్యూలైన్లు వద్ద ఈకార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇదిలా వుండగా భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకుని వేసవి ఉపశమన చర్యల్లో భాగంగా వేసవి ప్రారంభమైనప్పటి నుండి ప్రతి రోజూ ఆలయం వెలుపల ఉదయ నుండి సాయంత్రం వరకు ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే గత రెండు రోజుల నుండి ప్రత్యేక సిబ్బందితో మొబైల్ వాటర్ క్యాన్‌ల ద్వారా భక్తులకు ఆలయ లోపల, వెలుపల త్రాగునీటిని పంపిణీ చేస్తునా న్నరు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, అన్నదానం ఇన్‌చార్జ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### మామిడి తోటలపై ఏనుగులు దాడులు

రామకుప్పం, మే 31 ప్రభాతవార్త



మండలంలోని ననియాల అటవీ సమీప ప్రాంతంలో జంట ఏనుగులు మామిడి తోటలపై దాడి చేశాయి. శనివారం రాత్రి శంకరప్పకు చెందిన మామిడి కొమ్మలను విరిచి కాయలను నేలరాల్చాయి. ప్రతిరోజు ఏనుగుల దాడుల వల్ల భయాందోళనకు గురవుతున్నామని స్థానిక రైతులు వాపోయారు. వరి, టమోటో, రాగి, పశుగ్రాసం తిన్నంత తిని తొక్కి నాశనం చేశాయి. అధికారులు స్పందించి నష్టపరిహారాన్నిఅందజేసి, ఏనుగుల నిరోధానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక - కడ పి.డి

కుప్పం, మే 31 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10.30గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలనుంచి సమస్యలపై నేరుగా వినతులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ప్రజల మనోభావాలు దెబ్బతీస్తే సహించేది లేదు

– టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్

కుప్పం, మే 31 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని నియోజకవర్గ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక షాదీమహల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన రెస్కో డైరెక్టర్ అమీర్, నేతలు ఉమేర్‌ఖాన్, సలాం, అల్లాబకష్ తదితరులతో కలసి మాట్లాడారు. గుడుపల్లె మండలం మిట్టూరుకు చెందిన ఇద్దరు యువకులు సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టడం దురదృష్టకరమన్నారు. ఈ పోస్టులతో ఎవరి మనోభావాలు అయినా దెబ్బతిని ఉంటే అన్యదా భావించరాదన్నారు. మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించడం మంచిది కాదన్నారు. యువకుల తల్లిదండ్రులు సైతం ఈ విషయంలో బాధ్యత వహించాలన్నారు. ఈ సంఘటన పట్ల పోలీసు అధికారులు కూడా సకాలంలో స్పందించి యువకులను అదుపులో తీసుకుని విచారించడం జరుగుతోందన్నారు. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఎవరూ వ్యవహరించరాదన్నారు. భారతదేశంలో హిందు, ముస్లిం సోదరులు అన్నదమ్ముల్లా ఉన్నామనే విషయం మరువరాదన్నారు. కార్యక్రమంలో నేతలు ముజీబ్, ఆదిల్, అస్లంఖాన్, గనిఉల్లా, జాలు, తదితరులు పాల్గొన్నారు

### కుప్పంలో 30 పోలీస్ యాక్ట్ - డిఎస్పీ పార్థసారథి

కుప్పం, మే 31 ప్రభాతవార్త



జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు కుప్పం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో జూన్ 1-30తేదీల వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు డిఎస్పీ పార్థసారథి తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ఎవరైనా సభలు సమావేశాలు జరపాలంటే ముందస్తు అనుమతులు తప్పక తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ అందరూ సహకరించాలని పేర్కొన్నారు.

### రక్తదాతలు ప్రాణదాతలు

శాంతిపురం, మే 31 ప్రభాతవార్త



సమాజంలో రక్తదానం మహాదానమని రక్తదాతలు ప్రాణదాతలు అని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం తుమ్మిశి ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో కుప్పం లయన్స్ బ్లడ్ డోనర్స్ అధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేస్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహలకు తావివ్వరాదని సూచించారు. యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం పట్ల వారిని అభినందించారు. రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు డాక్టర్ వెంకటేష్, నాను, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### చంద్రప్రభ ఉభయదారుల ఐక్యంతోనే దళితసత్రం సాధన

చిత్తూరురూరల్, మే 31 ప్రభాతవార్త:




దళితసత్ర సాధనకు చంద్రప్రభ ఉభయదారులందరూ ఐక్యంగా ముందుకు రావాలని కాణిపాక దేవస్థాన చంద్రప్రభ ఉభయదారులు పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్ నందు సీనియర్ నాయకులు నటరాజ, బొజ్జయ్యలు మాట్లాడుతూ కాణిపాక వరసిద్ది వినాయకస్వామి ఆలయ పవిత్రతను దెబ్బతీసే విధంగా ఉభయదారుని పేరును చెప్పుకొని సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారనీ, 14 గ్రామాలకు చెందిన ఉభయదారులు ఎక్కడ కూడా ఆలయ పవిత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరించలేదన్నారు. గతంలో బినామీ పేర్లతో షాపులు తీసుకొని దాదాపు కోటిరూపాయలు ఎగనామం పెట్టలేదా అని ప్రశ్నించారు. త్వరలో ఎమ్మెల్యే, ఈవో సహకారంతో దళితుల కల దళితసత్రంను కేటాయించనున్నారనీ, దీనిని అడ్డుకోవడం కోసం కుట్ర చేయడం బాధాకరమని, ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం ఉభయదారులు ఎం మహేష్ స్వేరో మాట్లాడుతూ కాణిపాక దేవస్థానం పరిధిలోని చంద్రప్రభ ఉభయదారులకు చెందాల్సిన దళిత సత్రం ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో వున్న విషయం అందరికీ తెలిసిందేనని, దీనిపై పలువురు ఎన్నో సంవత్సరాలుగా చేస్తున్న పోరాటాల ఫలితంగా తుదిదశకు చేరుకొందన్నారు. ప్రస్తుతం చంద్రప్రభ ఉభయదారులు, నాయకులు, పెద్దలు, గ్రామస్తుల సుదీర్ఘపోరాటాల ఫలితంగా దళిత సత్రం అందజేయడానికి ఎమ్మెల్యే మురళీమోహన్, దేవస్థానచైర్మెన్ మణినాయుడు, ఈవో పెంచలకిషోర్‌లు న్యాయపరమైన, చట్టపరమైన అడ్డంగులను సుదీర్ఘంగా పరిశీలించి కొన్ని నెలల క్రితం బోర్డు సమావేశంలో దళిత సత్రంను చంద్రప్రభ ఉభయదారులకు అందజేయడానికి సిద్దంగా వున్నామని తెలియజేయడం అందరికీ విదితమేనన్నారు. కానీ ప్రస్తుతం కొందరు దీనిని కుట్ర పూరితంగా అడ్డుకోవడానికి ప్రయత్నించడం దారుణమని, ఇలాంటి కుట్రపూరిత, స్వార్థపు చర్యలు మానుకోవాలని వ్యక్తిగత ప్రయోజనాల కన్నా దళితులందరి ప్రయోజనాల కోసం సహకరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో చంద్రప్రభ ఉభయదారులు, సీనియర్ నాయకులు రఘుపతి, గుణశేఖర్, రాజేంద్ర, మురుగేష్, మునస్వామి, షణ్ముగం, రామ్మూర్తి, గణేష్, మహేష్, నరేష్, అమర్, ప్రదీప్, ప్రశాంత్, అశోక్‌కుమార్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

చిత్తూరురూరల్, మే 31 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, విజయం కళాశాల ఆవరణం నందు ఆదివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంను పురస్కరించుకొని రెడ్‌క్రాస్ చైర్మెన్ డా. తేజోమూర్తి యువత గంజాయి, పొగాకు తదితర వాటికి బానిస కావద్దని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేటి యువత సిగరెట్లు, బీడి, పొగాకు, గంజాయి తదితర దురవాట్లకు, వ్యసనాలకు లోనై సమాజంలో అనారోగ్య వాతావరణం సృష్టిస్తూ వారి బంగారుభవిష్యత్తును నాశనం చేసుకొంటున్నారన్నారు. అందరూ కలసి ఆరోగ్యవంతమైన సమసమాజం కోసం యువత మేలుకో పొగాకు, సిగరెట్టు, బీడి మానుకో అని యువతను చైతన్య పరుద్దామని తేజోమూర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మెన్ గోవర్ధన్, జిల్లా కార్యదర్శి సహదేవనాయుడు, కమిటీ మెంబర్లు సుధాకర్, రెడ్‌క్రాస్ సిబ్బంది గోపి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అర్ధగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, మే 31 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం అధిక జ్యేష్టమాస పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి, ఈఓ ఇ.మునిశేఖర్‌ల ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారి మూల విరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అర్చకులు ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో సుదర్శనహోమం, ఆకుపూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించడంతో పాటు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేచే శిశువిహార్‌కు ఏసి వితరణ

చిత్తూరురూరల్, మే 31 ప్రభాతవార్త:




చిత్తూరు కలెక్టరేట్ వద్ద నున్న శిశువిహార్ చిన్నపిల్లల సంరక్షణ కేంద్రానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఏసి వితరణగా అందించారు. ఆదివారం జిజేఎం చారిటబుల్‌ఫౌండేషన్ తరపున ఏసిని అధికారులకు అందజేసి, శిశువిహార్‌ను పరిశీలించి పిల్లల సంరక్షణ, ఇతర అంశాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ త్యాగరాజులు, తదితరులు పాల్గొన్నారు.

# భూమిలేని దళితులకు 2 ఎకరాల సాగు భూమి ఇవ్వాలి

**డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు**

రైల్వేకోడూరు రూరల్, మే 31 ప్రభాతవార్త




పేదల సంక్షేమానికి తూట్లు పొడిచి పాలకులు ప్రచారానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తారా అని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు సూటిగా ప్రశ్నించారు. ఆదివారం కోడూరు పట్టణంలోని దళిత హక్కుల పోరాట సమితి కోడూరు నియోజకవర్గ ప్రథమ మహాసభ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించి టోల్గేట్ వద్ద నీలి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎర్రచందనం పార్కులో నాగమ్మ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య స్వాగతం పలికారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు కొట్టి ప్రచార ఆర్భాటాలకు కోట్ల రూపాయలు వెచ్చించడం ఎంతవరకు సమంజసమని హెచ్చరించారు. కరెంట్ షాక్ తో పిఠాపురంలో దళిత బిడ్డ మరణించారని కనీసం పవన్ కళ్యాణ్ పట్టించుకున్న పాపాన పోలేదని వారు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో దళితుల ఓట్లు మాకు వద్దని డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు అనడం అతని అవివేకానికి నిదర్శనమని వారు అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ జిల్లాలో దళిత గిరిజన భూములను అగ్రవర్ణాలు కబ్జా చేస్తుంటే ప్రభుత్వంగాని, అధికారులు గానీ పట్టించుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కార్యదర్శి చిన్నం పెంచలయ్య, తులసి రాజన్, ఆదినారాయణ, రత్నమ్మ, మాల మహానాడు నాయకురాలు వెంకటేశ్వరమ్మ, సరోజనమ్మ, నాగేశ్వరరావు, కటారి గోపాల్, మోడీ శివయ్య తోపాటు డిహెచ్పిఎస్ కి చెందిన కార్యవర్గం పాల్గొన్నారు.

## శ్రీ వీరభద్రుని ఆలయంలో మహాలక్ష్మి యాగం.



**చిట్వేలి, మే 31 ప్రభాతవార్త:**

స్థానిక పాత చిట్వేలి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో ప్రతినెలా నిర్వహించే పౌర్ణమి పూజల్లో భాగంగా శ్రీ మహాలక్ష్మి యాగంను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారి మూల విగ్రహాలకు పట్టు వస్త్రాలు పరిమళభరిత పుష్పాలతో శోభాయ మానంగా అర్చకులు మృత్యుంజయ అలంకరించారు. టిటిడి వేద పాఠశాలకు చెందిన పండితులు ఉదయం శ్రీ మహాగణపతి పూజ, కుంబారాధన, శ్రీ మహాలక్ష్మి యాగం, పూర్ణ హారతి మరియు వేద విన్నపాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీర్ఘ మాంగళ్యం, పుత్రాభివృద్ధి, ఆరోగ్యం, ఆయుషు, విద్య, ఉద్యోగం, సంతోషం ఈ యాగం నిర్వహించడం వల్ల చేకూరుతాయని టీటీడీ పండితులు తెలియపరిచారు. మహిళలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని భక్తితో మహాలక్ష్మి యాగాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన వితరణకు తిరుపతికి చెందిన జ్యుడీషియల్ అధికారి కిరణ్ కుమార్ ధాతలుగా నిలిచారు. కార్యక్రమంలో బెంగుళూరు వాస్తవ్యులు పద్మరాజు రామచంద్రరాజు, తిరుమల రెడ్డయ్య, యన్నారు కిషోర్, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, స్థానిక గ్రామస్తులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ పెద్దలు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

## డిసీఎంపై దుష్ప్రచారాన్ని ఖండించిన తాతంశెట్టి.

చిట్వేలి, మే 31, ప్రభాతవార్త:

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయ జీవితంపై రాజకీయ విశ్లేషకులు, ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర అన్నారు. ఆదివారం స్థానిక జనసేన కార్యాలయంలో తాను పాత్రికేయులతో మాట్లాడారు. రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర రావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, వాటికి ఆధారాలు ఏమిటని..?? జనసైనికులు ప్రశ్నించడంతో ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని తెలిపారు. తెలంగాణలో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని, తెలంగాణ వాదం అంటే అభివృద్ధి కోసం పరస్పర సహకారం కావాలని, కానీ కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని అవమానించే చర్యలను తీవ్రంగా ఖండించిన నాగేంద్ర, అది కేవలం ఒక వ్యక్తి చిత్రపటంపై దాడి కాదని, లక్షలాది మంది జనసైనికుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. అలాంటి చర్యలను ప్రజలు సహించరని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కొందరు వైసీపీ నేతలు పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా కాపు సామాజిక వర్గాన్ని మాత్రమే పవన్ కళ్యాణ్‌కు పరిమితం చేసే ప్రయత్నాలు సరికావని, ఆయన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు సహా అన్ని వర్గాల ప్రజల నాయకుడిగా ఎదిగారని చెప్పారు. పవన్ కళ్యాణ్ భూముల అంశంపై వస్తున్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. 2014లో చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, సంబంధిత చట్టాల ప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తయిన భూములేనని స్పష్టం చేశారు. నిషేధిత భూముల జాబితాలో పవన్ కళ్యాణ్‌కు చెందిన భూములు లేవని తెలిపారు. పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలకు ప్రజలు తగిన సమయంలో సమాధానం చెబుతారని నాగేంద్ర హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మాదాసు నరసింహ, బత్తిన గంగయ్య యాదవ్, మద్దూరి మన్మధ, షేక్ రియాజ్, పెద్దంగారి సాయి, ఆనందలతేజ, మలిశెట్టి రమేష్, మహంకాళి నాగేంద్ర, మాదినేని రాజా, నందు, తేజ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన శ్రీ అంకాళమ్మ తిరుణాళ

**పుత్తూరు రూరల్, మే 31 ప్రభాతవార్త:**



పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపు కండ్రిగ గ్రామంలో వెలెసిన గ్రామదేవత శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి తిరుణాళ్లు ఆదివారంతో ముగిసింది. ఈ తిరుణాళ్లు శుక్రవారం నుంచి ప్రారంభమై ఆదివారంతో ముగిసింది. ఉదయం ఆలయంలోని అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం భక్తులు పసుపు వస్త్రాలు ధరించి వేపాకు చేత పట్టుకుని అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో విద్యుత్ దీపాలంకరణతో డప్పు వాయిద్యాలు నడుమ అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు పెట్టి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేకమైన ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## పుత్తూరులో నాగమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం

**పుత్తూరు రూరల్, మే 31 ప్రభాతవార్త:**

పుత్తూరు పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలో నాగాలమ్మ తల్లి మానసాదేవి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నగరి నియోజకవర్గంకు చెందిన ప్రముఖ నేత పోతుగుంట విజయబాబు ముఖ్య అతిథిగాహాజరై భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, ఆలయ కమిటీసభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ భగవానుడికి మండల పూజలు

**పుత్తూరు రూరల్, మే 31 ప్రభాతవార్త:**



పుత్తూరు మండల పరిధిలోని గొల్లకండ్రిగ గ్రామంలో వెలసిన శ్రీ బామ్మ రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలస్వామి మండల పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన కాంతారావు అనుపమ దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు అలంకరణలు, అర్చనలు చేశారు. అలాగే ఆలయానికి సుమారు రూ.1 లక్ష 60 వేలు విలువతో స్వామివారి చిత్రపటాన్ని ఆలయానికి వితరణగా అందించారు. 40 రోజుల పాటు మండల పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు.

## ఎస్సీసెల్ మండల నాయకుడిని అభినందించిన ఎమ్మెల్యే

**విజయపురం, మే 31 ప్రభాతవార్త:**



మండలంలోని విజయపురం దళితవాడకు చెందిన ఎస్సీ సెల్ మండల నాయకుడు కపిల్‌ని ఆదివారం నగరి టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శాలువ కప్పి అభినందించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు ఏ.ఎం.రాధాకృష్ణ, కోసలనగరం సింగిల్‌విండోఅధ్యక్షుడు బాబుయాదవ్, టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు ఉన్నారు.

## బాధితులకు ఎప్పుడు అండగా ఉంటాము

**– సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత**

**నాగలాపురం, మే 31 ప్రభాతవార్త:**

నాగలాపురం మేజర్ పంచాయతీ పరిధిలో బీసీ కాలనీకి చెందిన తులసిరామ్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వైద్య ఖర్చులు భరించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎం రిలీఫ్ ఫండ్) కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.48,795 ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు విడుదలైన చెక్కును సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి చేతుల మీదుగా, నాగలాపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డి సహకారంతో ఆదివారం బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య చికిత్సల కోసం ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. అవసరమైన ప్రతి అర్హత కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహాయం అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రతినిధులు, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, నాగలాపురం మండల ఐటీడీపీ అధ్యక్షుడు నరేంద్రరెడ్డి, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డుపై రాళ్ల కుప్పలు.. పట్టించుకోని అధికారులు.!

**– పాకాలలో నరకప్రాయంగా మారిన రహదారి**

**– వాహనదారుల తీవ్ర ఇబ్బందులు**



**పాకాల, మే 31, ప్రభాతవార్త**

పాకాల మండల కేంద్రంలోని స్థానిక భారతం మిట్ట నుండి పాలినేనివారిపల్లెకు వెళ్లే తారు రోడ్డు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. కొందరు స్థానికులు ఈ ప్రధాన రహదారిని పూర్తిగా ఆక్రమించుకుని, తమ స్వంత అవసరాల కోసం రోడ్డుపైనే యథేచ్ఛగా పెద్ద ఎత్తున రాళ్లు, బండ్లు, చెత్తా చెదారాన్ని పడేస్తున్నారు. దీనివల్ల రహదారి సగానికి పైగా మూసుకుపోయి, వాహనదారులు ప్రయాణించడానికి వీల్లేకుండా ఇరుకుగా తయారైంది.

**– రైల్వే గేట్ పడితే తీవ్ర ట్రాఫిక్ జాం..**

ముఖ్యంగా రైల్వే గేట్ పడిన సమయంలో, ప్రత్యామ్నాయ మార్గంగా వాహనదారులందరూ ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉంటుంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఒకేసారి రావడం.. రోడ్డుపై ఈ అక్రమ ఆక్రమణలు, రాళ్ల కుప్పలు అడ్డంగా ఉండటంతో ఇక్కడ తీవ్రమైన ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. అత్యవసర సమయాల్లో ప్రయాణించే వారు, పాఠశాల విద్యార్థులు గంటల తరబడి ఇక్కడే నిలిచిపోవాల్సి వస్తోందని స్థానికులు మరియు వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**– అధికారుల ఉదాసీనతపై మండిపాటు..**

రోడ్డుపై ఇంత పెద్ద ఎత్తున ఆక్రమణలు జరుగుతున్నా, వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు మరియు రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, రోడ్డుపై అడ్డంగా ఉన్న రాళ్ల కుప్పలను, చెత్తను తొలగించి, రద్దీగా ఉండే ఈ రహదారిని పునరుద్ధరించాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ - శంకర్‌రెడ్డి

**సత్యవేడు, మే 31 ప్రభాతవార్త:**



సత్యవేడు నియోజకవర్గంలో ప్రజలకు ఆపత్కాలంలో నేనున్నా అంటూ నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి సత్యవేడు నియోజకవర్గానికి చెందిన 11 మందికి శస్త్ర చికిత్సలు చేసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వచ్చిన చెక్కులను తిరుపతి పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాలతో సత్యవేడు నియోజకవర్గంలో ఏ ఒక్కరికి సమస్య వచ్చినా తమవంతు బాధ్యతగా సాయం చేయడానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. ఇందులో భాగంగా కేవీబీపురం, నాగలాపురం, పిచ్చాటూరు, వరదయ్యపాళెం, బీఎన్ కండ్రిగ మండలాలకు చెందిన 11 మందికి రూ.6 లక్షల 85 వేల 288లు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎం రిలీఫ్‌ఫండ్) చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వరదయ్యపాళెం మంలం చెన్నవరం సాయి(సీఎల్ఎన్‌పల్లి) రూ.27,341లు, డి.మంజుల(సీఎల్ఎన్ పల్లి) రూ.23,100, సి.పుష్ప(చిన్నపాండూరు) రూ.22.114, వి.ప్రభుదాస(మత్తేరి మిట్ట) రూ.56,851, ఎం.చంద్రయ్య(బీఎన్ కండ్రిగమండలం కారణి) రూ.23,889, వేమసాని రత్నమ్మ(వెస్ట్ వరత్తూరు) రూ.2,52,825, బొగ్గల కృష్ణయ్య(తలారివెట్టు) రూ.57,522, నాగలాపురం మండలం బి.తులసిరామ రూ.48,765, కె.శంకర్(నాగలాపురం) రూ.37,878, పిచ్చాటూరు మండలం కె.తులసిరాం(కీళపూడి) రూ.35 వేలు, కేవీబీ పురం మండలం పి.జయధనుష్(కోటమంగాపురం) రూ.1,00,00లు అందజేశారు. కార్యక్రమంలో బాధితులతో పాటు మండల అధ్యక్షుడు సతీష్‌నాయుడు, చెంచు రామానాయుడు, కార్తీక్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు సాయిసుధ ప్లేస్కూల్ ప్రారంభోత్సవం

**తిరుపతి, మే 31ప్రభాతవార్త:**

తిరుపతి విద్యానగర్ నాల్గవక్రాస్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన సాయిసుధ ప్లేస్కూల్ ఏసి క్యాంపస్ సోమవారం ప్రారంభంకానుంది. విద్యార్థులకు చిన్నారులకు పుస్తకాలతో గాకుండా డిజిటల్ విధానంలో సులభశైలిలో అర్థమయ్యే రీతిలో విద్యాబోధన తమ లక్ష్యమని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ రాళ్ళపల్లి సుధారాణి తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి డాక్టర్ రేఖ రాళ్ళపల్లి, వెంకటరామానాయుడు గుడివాడ, డాక్టర్ వైష్ణవి రాళ్ళపల్లి ముఖ్యులుగా విచ్చేస్తున్నారని డాక్టర్ సుధారాణి తెలిపారు.



## కదులుతున్న బస్సు నుంచి దిగబోతూ ప్రమాదం

**వరదయ్యపాలెం, మే 31, ప్రభాతవార్త**

వరదయ్యపాలెం బస్టాండ్ వద్ద నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కిన పాండూరుకు చెందిన హారిక కదులుతున్న బస్సు నుంచి దిగేసిన తన తల్లితో పాటు బస్సు దిగే క్రమంలో బస్సు వెనుక టైరు కింద హారిక (16) పడిపోయింది. దీంతో హారిక కాలి పాదం మీద బస్సు వెనుక చక్రం ఎక్కడంతో హారిక పాదం నుజ్జు అయి తీవ్ర గాయాలకు గురైంది. దీంతో హారికను చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఆసుపత్రికి తరలించారు. ఇదే విషయమై వరదయ్య పాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జూదరులు అరెస్ట్

**తిరుపతి, మే 31 ప్రభాతవార్త:**

తిరుపతి నగరంలో జూదంపై పోలీసులు దాడి చేశారు. సరదాగా జూదమాడుతున్న వారిపై పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. 7గురు అరెస్ట్ 3,150 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని లెప్రసీ హాస్పిటల్ వెనుక భాగంలో ఉన్న ముళ్ళ పొదలలో జూదం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం. జూదరులను అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి ఎస్సై దుర్గ ప్రసాద్. గ్యామ్లింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## నేడు తిరుపతి తహశీల్ధార్ కార్యాలయంలో

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక**

**తిరుపతిరూరల్, మే31 ప్రభాతవార్త:**

తిరుపతి అర్బన్ తహశీల్ధార్ కార్యాలయలంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) నిర్వహించనున్నారు. మండల ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ధృవపత్రాలతో హాజరై నేరుగా ఫిర్యాదులు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రతి ఫిర్యాదుకు రశీదు ఇచ్చి, నిర్ణీయత గడువులో పరిష్కారం అందిస్తామని తెలిపారు. మండల స్థాయిలో పరిష్కరించలేని అంశాల కోసం మాత్రమే కలెక్టరేట్‌ను సంప్రదించాలని తహశీల్ధార్ స్పష్టం చేశారు.

## తిరుపతి యూత్ హాస్టల్‌కు ఐఎస్ఓ గుర్తింపు




**–మేనేజర్ మోహన్‌రెడ్డి కృషికి ప్రసంశలు**

**తిరుపతిరూరల్, మే 31 ప్రభాతవార్త:**

తిరుపతి నగరములో ఉన్న గవర్నమెంట్ యూత్ హాస్టల్ అభివృద్ధి దిశగా పయ ణిస్తూ...ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోంది. పరిశుభ్రత, భద్రత, నాణ్యమైన సౌకర్యాల కల్పనలో ఈ హాస్టల్ ప్రత్యేక గుర్తింపు పొందుతుంది. ఈ అభివృద్ధికి ప్రధాన కారణంగా నిలుస్తున్న మేనేజర్ పి.మోహన్‌రెడ్డి సేవలు విశేషంగా నిలుస్తున్నాయి. మాజీ సైన్నికుడైన మోహన్‌రెడ్డి తన క్రమశిక్షణ, నిబద్ధతతో హాస్టల్ నిర్వాహణలో మార్పులు తీసుకు వచ్చారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నివాసితులకు సురక్షిత వాతావరణం కల్పించడం, ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అతని నాయకత్వంలో హాస్టల్‌లో పలు సంస్కరణలు చేపట్టడంతో పాటు సేవల నాణ్యత పెరిగింది. ఈ క్రమంలో తిరుపతి యూత్ హాస్టల్‌కు ఐఎస్ఓ సర్టిఫికేషన్‌ను అందుకోవడం విశేషం. ఇది హాస్టల్ సేవల ప్రమాణాలను మరింతగా పెంచే దిశగా కీలక మైలురాయిగా భావిస్తున్నారు. స్థానిక ప్రజలు, హాస్టల్‌లో ఉండేవాళ్ళు మోహన్‌రెడ్డి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ యూత్ హాస్టల్‌ను ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర కీలకమని అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత ప్రమాణాలు సాధించే దిశగా అడుగులు వేస్తోంది.

## నేడు తిరుపతి-రక్సౌల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

**తిరుపతి, మే 31ప్రభాతవార్త:**



దక్షి ణ కోస్తా రైల్వే గుంతకల్ డివిజన్ ఆధ్వర్యంలో తిరుపతి–రక్సౌల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం సోమవారం ఉదయం లాంఛనంగా తిరుపతిలో జరగనుంది. ఈ కార్యక్రమం నేటి ఉదయం 8:15 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్‌లో నిర్వహించనున్నారు. ఈ రైలు తొలి ప్రయాణాన్ని అధికారులు, ప్రజాప్రతినిదులు జెండా ఊపి ప్రారంభించనున్నారు. గతంలో ప్రత్యేక రైలుగా నడిచిన ఈ సేవకు శాశ్వత రూపం కల్పిస్తూ రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలుగా ప్రవేశపెడుతున్నారు. ఈ రైలు తిరుపతి నుండి బయలుదేరి రేణిగుంట, కడప, గుంతకల్, రాయచూర్, వికారాబాద్ మార్గాల మీదుగా ప్రయాణించి సాయంత్రానికి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

## పూర్వ విద్యార్థులచే తాతయ్యగుంటగంగమ్మకు సారే

**తిరుపతి, మే 31ప్రభాతవార్త:**



తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ తల్లికి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ 1983–84 సంవత్సరపు పూర్వ విద్యార్థులు ఆదివారం భక్తితోసారే సమర్పించారు. అత్యంత పవిత్రంగా అంగరంగ వైభవంగా తిరుపతిలో ప్రతియేటా నిర్వహించే గంగమ్మ జాతర తర్వాత వచ్చే ఆదివారాలలో ఈ కార్యక్రమం చేయడం అత్యంత విశేషమని అసోసియేషన్ కార్యదర్శి, చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యదర్శి కేఎల్ వర్మ తెలిపారు. ఉదయం 8 గంటలకు అసోసియేషన్ సభ్యులందరూ కుటుంబంతో కలిసి అత్యంత వైభవోపేతంగా, ఊరేగింపుగా తాతయ్యగుంట గంగమ్మ గుడికి మేళ తాళాలతో వెళ్లి అమ్మవారికి సారే సమర్పించే కార్యక్రమం పూర్తిచేసి, పట్టణ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. సారే సమర్పించిన మిత్ర బృందం అందరికీ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్ ఈఓ జయ కుమార్, హరి, కిశోర్‌ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహింపజేసి వేద పండితులచే ఆశీర్వచనం అందించారు. కార్యక్రమం అనంతరం అసోసియేషన్ సభ్యులచే అమ్మవారి భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమం అనంతరం గత 50 సంవత్సరములుగా కలిసి ఉన్న స్నేహితులను వారి కుటుంబ సభ్యులను పలువురు అభినందించడం జరిగింది. 50 సంవత్సరాల కాలంగా స్నేహాన్ని కొనసాగించడం ఆధునిక యుగంలో సాధ్యం కాదని ఈ బృందంలో చాలామంది ఎల్కేజీ నుంచి ఇప్పటివరకు కుటుంబ సభ్యులందరితో కలిసి మెలిసి ఉండడం, స్నేహపూర్వకంగా బాధలు, సంతోషాన్ని అందరూ పంచుకోవడం చూస్తుంటే ఆనందదాయకంగా ఉందనివక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కెఎల్ వర్మ, ఆర్.ఆర్ శ్రీనివాస్, కులశేఖర్, పగడాల అర్జున్, శ్రీనివాసులు, జైచంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, చెంగయ్య, సుబ్రహ్మణ్యం, గురుమూర్తి, రాము, రాయ్, నరేంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోలీస్ సెక్షన్30 అమలు

**తిరుపతి, మే 31ప్రభాతవార్త:**




అవాంఛనీయ సంఘటనల నివారణ , శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్1861లోని సెక్షన్30 అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా సబ్‌డివిజనల్ పోలీస్ అధికారులు తెలిపారు. తిరుపతి, తిరుమల ప్రాంతాలకు దేశ విదేశాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వేంకటేశ్వర స్వామి దర్శనార్థం తరలివస్తున్న నేపథ్యంలో, ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు నేటి నుండి నెల రోజుల పాటు అమల్లో ఉంటాయి. ఈ కాలంలో తిరుపతి జిల్లా పరిధిలో ఎటు వంటి ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలు, సమావేశాలు ఇతర సామూహిక కార్యక్రమాలు నిర్వహించదలచిన వారు సంబంధిత పోలీస్ అధికారుల అనుమతితో పాటు సంబంధిత సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్‌డీపీఓ) కార్యాలయం నుండి ముందస్తు లిఖితపూర్వక అనుమతి పొందాలి,.ప్రజా రహదారులు, కూడళ్లు ,ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఒకేసారి వివిధ రాజకీయ పార్టీలు, సంఘాలు, సంస్థలు కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

## స్విమ్స్ వైద్యులు డాక్టర్ మునుస్వామి మృతి బాధాకరం

**మాజీ మంత్రి పరసారత్నం**

**రామచంద్రాపురం, మే 31 ప్రభాతవార్త:**



తిరుపతి స్విమ్స్ వైద్యశాలలో అత్య వసర విభాగంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ వైద్యులు డాక్టర్ మునుస్వామి మృతి భాధాకరమని మాజీ మంత్రి పరసారత్నం విచారం వ్యక్తం చేశారు. ఆదివారం తడ మండలం, మాంబట్టు గ్రామంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబా బుతో కలసి మునుస్వామి మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర విభాగంలో రాత్రింబవళ్ళు విధులు నిర్వహించిన వైద్యుడు దైవ కార్యం నిమిత్తం స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం అత్యంత భాధాకరమన్నారు. మునుస్వామి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాబు యాదవ్, ఉమాపతి రావు, సమర సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## 2న బూత్ లెవెల్ ఏజెంట్ల అవగాహన సదస్సు



సూళ్ళూరుపేట, మే 31 ప్రభాతవార్త: ఎన్నికల నిర్వహణ, బూత్ స్థాయి వ్యూహాలు, సంస్థాగత బలోపేతంపై ఏజెంట్లకు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కీలక దిశానిర్దేశం చేసారు. మంగళవారం నాయుడుపేట పట్టణంలో వైఎస్సార్సీపీ బూత్ లెవెల్ ఏజెంట్ల అవగాహన సదస్సును భారీ ఎత్తున నిర్వహించనున్నారు. స్థానిక డీఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఉదయం గంటలకు ఈ ప్రతిష్టాత్మక సమావేశం ప్రారంభం కానుంది. సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య అధ్యక్షతన జరగబోయే ఈ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ అంతర్గత ప్రాధా న్యత కలిగిన సమావేశానికి నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులతో పాటు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు మరియు బూత్ లెవెల్ ఏజెంట్లు అందరూ ఒక్కరు కూడా మిస్ కాకుండా తప్పనిసరిగా సకాలంలో హాజరై, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పార్టీ ముఖ్య నాయకత్వం పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.

## తెలుగు కాలువలో... శవమై తేలిన లారీ డ్రైవర్!



బాలాయపల్లి, మే 31 ప్రభాతవార్త: తెలుగు కాలువలో గల్లంతైన లారీ డ్రైవర్ ఉస్మాన్ శవాన్ని పోలీసులు గుర్తించారు. లారీ డ్రైవర్ ఉస్మాన్ శవాన్ని తెలుగు కాలంలో దిగి శనివారం గల్లంతయ్యారు. కలపాడు వద్దన్న తెలుగు గంగ కాలువలో ఉస్మాన్ శవం చెట్టుకొమ్మకు తగులుకొని ఉండడంవని గుర్తించారు. ఉస్మాన్ సవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

## రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా విరివిగా సేవలు



బాలాయపల్లి, మే 31 ప్రభాతవార్త: రెడ్ క్రాస్ సంస్థ ద్వారా విరివిగా సేవలందిస్తామని ఆ సంస్థ ఈసీ మెంబర్ సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు. వెంకటగిరి ఆర్‌విఎం ఉన్నత పాఠశాలలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల సమావేశం జరిగింది. తిరుపతి జిల్లా ఏర్పడిన తర్వాత రెడ్ క్రాస్ సొసైటీని ఈ జిల్లాలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జిల్లా వ్యాప్తంగా రక్త సేకరణ చేయాలని చెప్పారు. ఆపదలో ఉన్నవారికి సొసైటీ ద్వారా రక్తం కూడా ఇస్తామని చెప్పారు. రెడ్ క్రాస్ సొసైటీని అందరి సహకారంతో బోలోపేతం చేస్తామని చెప్పారు. రెడ్ క్రాస్ సొసైటీకి ఇప్పుడే కొత్త కార్యవర్గం ఏర్పాటు చేయరని తెలిపారు. సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు దొడ్డి భాస్కర్ రెడ్డి, బీరం రాజేశ్వరరావు, తిరుమల శెట్టి వల్లభ దాస్, సిహెచ్ మనోహర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సేవామూర్తి...డాక్టర్ మునుస్వామి దుర్మరణం



తడ, మే 31 ప్రభాతవార్త : సిమ్స్ హాస్పిటల్ రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కారణ మునుస్వామి యాదవ్ ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తిరుపతి నుండి స్వగ్రామం మాంబట్టు గ్రామంలో దేవాలయంలో జరుగుతున్న పూజలో పాల్గొనేందుకు వెళుతున్న సమయంలో మాంబట్టు అపాచీ రోడ్డు వద్ద ప్రయాణిస్తున్న కారు వెనుక టైరు పగలడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వేప చెట్టును కారు ఢీకొనింది. కారులో ప్రయాణిస్తున్న డాక్టర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సిమ్స్ హాస్పిటల్ నందు ఎందరికో వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడిన మున స్వామి డాక్టర్ మరణం స్థానికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లోనే కాక తిరుపతి జిల్లాలో నిరుపేదలకు అనారోగ్య సమస్య తలెత్తితే మొదటగా గుర్తొచ్చే పేరు మునుస్వామి డాక్టర్ తిరుపతికి వెళితే మునుస్వామి డాక్టర్ అన్ని చూసుకుంటారనే భావన ప్రజల్లో ఉంది వైద్యం అందించడమే కాకుండా వారికి కావలసిన సదుపాయాలు సమకూర్చి ఆర్థిక సహాయం అందించేవారు మాంబట్టు డాక్టర్ మునుస్వామి చిన్ననాటి నుండి పదిమందికి సహాయం చేయాలనే సంకల్ప గుణం కలిగిన వారు వృత్తిపరంగా తిరుపతిలో స్థిరపడినప్పటికీ అనునిత్యం తాను పుట్టి పెరిగిన గ్రామంలోని వ్యక్తుల గురించి గ్రామ అభివృద్ధి గురించి అనునిత్యం పరితపించేవాడు మాంబట్టు గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి దాతల సహాయంతో తన సొంత కృషితో ఎంతో అభివృద్ధి చేశారు టీటీడీ దేవస్థానం సహకారంతో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు అన్నదానం సత్రం ఏర్పాటు చేసి ప్రతి పండుగకు నిత్య అన్నదానం నిర్వహించే విధంగా దాతల సహకారంతో గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు పేదల వైద్యుడు మాంబట్టు డాక్టర్ ఇక లేరన్న విషయం అందరిని దిగ్భ్రాంతికి గురిచేసింది సోమవారం ఉదయం 9 గంటలకు వారి స్వగ్రామం తడ మండలం మాంబట్టు నందు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

### వైద్యరంగంలో మునుస్వామి చేసిన సేవలు మరువలేనివి:
### -ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే విజయశ్రీ



సిమ్స్ హాస్పిటల్ డాక్టర్ మునుస్వామి రోడ్డు ప్రమాద ంలో ఆదివారం మృతి చెందారు వారి మృతిదేహానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఘన నివాళులర్పించారు. డాక్టర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు వైద్యరంగంలో డాక్టర్ మునస్వామి ఎనలేని సేవలు అందించారని ఎందరో ప్రాణాలను నిలబెట్టారని ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించే గొప్ప మనసున్న వ్యక్తిని కోల్పోవడం వైద్య రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు వెంట కామిరెడ్డి మురళిరెడ్డి, బొమ్మన్ పళని, వేనాటి రాజారెడ్డి, చిల్లకూరు సురేష్ రెడ్డి, వేనాటి జనార్దన్ రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గిరిజనులు అటవీ హక్కులను తెలుసుకోవాలి

### - నవజీవన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కె.సహదేవయ్య



బాలాయపల్లి, మే 31 ప్రభాతవార్త : గిరిజనులు అటవీ హక్కులను తెలుసుకోవాలని నవజీవన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సహదేవ తెలిపారు. వెంకటగిరిలోనే నవజీవన్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో గిరిజనులకు అటవీ హక్కులపై అవగాహన శిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 సంవత్సరాల నుండి అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కు వస్తుందని చెప్పారు. ఇతరులకు అయితే మూడు తరాల నుండి అటవీ భూములకు సాగు చేస్తుంటే హక్కు వస్తుందన్నారు. సమావేశంలో పిడి విక్టోరియా, ఈడి కే లావణ్య, ఆర్ఆర్‌డి సంస్థ అధ్యక్షులు గంగిరెడ్డి, రీసెర్చ్ పర్సన్స్ ప్రవీణ్ కుమార్, నిశాంత్, నిర్వాహకులు శ్రీనివాసులు, కుప్పయ్య, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే ఆరణి



బాలాయపలి, మే 31 ప్రభాతవార్త: రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు తెలిపారు. వెంకటగిరి పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. జనసేన పార్టీలోకి ఎవరైనా చేరవచ్చు అని ఆయన పిలుపు నిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచన మేరకు అందరూ పని చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పవన్ కళ్యాణ్ లక్ష్యమని చెప్పారు. గోదావరి పుష్కరాల కూడా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తున్నట్లు తెలిపారు. గోదావరి నదిలో అశుభ్రతను తొలగించేందుకు కూడా పవన్ కళ్యాణ్ అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. వెంకటగిరిలో వీర మహిళ మాధవి లత పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. ముందుగా పోలేరమ్మ గుడిలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్, నాయకులు రాజారెడ్డి మాధవి లత, సుధాకర్, సురేష్, నాగరత్నం, తోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# 2027 పుష్కరాల నాటికి...కాలుష్యరహిత గోదావరి లక్ష్యం

### గోదావరి ప్రక్షాళనకు రూ.100 కోట్లు.. ప్రత్యేక నిఘాతో వ్యర్థాల నియంత్రణ: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి విద్య, మే 31 ప్రభాతవార్త : గోదావరి నదిని కాలుష్యరహితంగా మార్చి 2027 గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు పవిత్రమైన నదీ తీరాలను అందుబాటులోకి తీసుకురావడమే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యమని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం తిరుపతిలోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గోదావరి పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, పరిశ్రమలు, ఆక్వా రంగం నుంచి వెలువడే వ్యర్థాలు గోదావరిలో కలవకుండా అడ్డుకునేందుకు రూ.100 కోట్లతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని 262 పంచాయతీల నుంచి విడుదలయ్యే మురుగునీరు నదిలో కలవకుండా చర్యలు చేపట్టడమే కాకుండా, పారిశ్రామిక మరియు ఆక్వా వ్యర్థాలు గోదావరిలో చేరుతున్న ప్రాంతాలను అధికారులు గుర్తించారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్య వేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్టీజీఎస్ తరహాలో ఈ కంట్రోల్ రూమ్‌లు పనిచేసేలా చర్యలు తీసుకున్నారని, కాలుష్య నియంత్రణ వ్యవస్థను సాంకేతిక పరిజ్ఞానంతో మరింత బలోపేతం చేస్తున్నారని వివరించారు. "స్వచ్ఛ గోదావరి–పవిత్ర పుష్కరాలు" కార్యక్రమం ద్వారా చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గోదావరి ప్రక్షాళన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పూర్తి మద్దతు అందిస్తున్నారని ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో గోదావరిని కాలుష్యరహితంగా మార్చే లక్ష్యాన్ని సాధిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, రాజేష్ ఆచారి, ప్రభాకర్ రెడ్డి, జీవకోన సుధా, మణి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్రమోడీ...మన్ కీ బాత్ స్ఫూర్తిదాయకం

### -బిజెపి నేత గుండాల గోపీనాథ్ రెడ్డి



తిరుపతి, మే 31ప్రభాతవార్త: ప్రధాని నరేంద్ర మోడీ ప్రతినెలా నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాదని బీజేపీ సీనియర్ నాయకుడు గుండాల గోపినాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వీక్షి ంచారు. ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్‌ 134వ ఎపిసోడ్‌లో ఆయన దేశ విదేశాల్లోని భారతీయులనుద్దేశించి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మనస్సులోని భావాలను తెలియజేస్తూ దేశంలోని అన్ని ప్రాంతల ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడే మన్ కి బాత్ కార్యక్రమాని దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభించిందన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం జరిగే మన్‌కి బాత్ కార్యక్రమాన్ని తాము తప్పకుండా వీక్షిస్తున్నామని ప్రధానమంత్రి కొత్త విషయాలను తెలియజేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, స్థానికులు కే ఎన్ రాజా చంగల్రాయ ఆచారి, లోక ప్రభాకర్ నాయుడు, ముని లక్ష్మయ్య, వెంకటరత్నం, చెంగల్ రాయులు విగ్రహాల కళ్యాణి, మహేష్, పురోహితుడు సురేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీని గ్రామీణ స్థాయి నుంచి పటిష్టం చేయాలి

### ప్రధాని నరేంద్రమోదీ మనస్సులో మాట



శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త: సుమారు 13 సంవత్సరాలుగా బిజెపి పార్టీ ప్రజలకు ఎనలేని సేవలందిస్తుంది. అన్ని వర్గాలను ఆకట్టుకునేటట్లు సంక్షేమ పథకాలను అందిస్తున్నా ఈ పథకాలకు సంబంధించి ఇంకా ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన రాలేదని, పార్టీని గ్రామీణ స్థాయి నుంచి పటిష్టం చేసుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందని ఆదివారంజ రిగిన 'మన్‌కి బాత్' కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపు నిచ్చారు. ప్రతి నెల 4వ ఆదివారం ప్రధాని మన్‌కి బాత్ కార్యక్రమంను నిర్వహిస్తూ తన మనస్సులోని మాటను పార్టీ నిర్ణయాలను ప్రతి కార్యకర్తతో పంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ కార్యక్రమంను పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసారు. రాష్ట్ర బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీకాళహస్తి పార్టీ ఇన్‌చార్జి కోలా ఆనంద్ సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో కోలా ఆనంద్‌తోపాటు జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రజ్ఞాశ్రీ, పార్టీ ప్రముఖులు చిలకా రంగయ్య, జివి అమర్‌నాథ్, మద్దు వాసు యాదవ్, పుణ్యం డిల్లికుమార్‌రెడ్డి, ఓబిసి మోర్చా పట్టణ అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాజీ అధ్యక్షులు కన్నా వెంకటేశ్వర్లు, తానికొండ్ల భరత్ నాయుడు, ధర్మయ్యయాదవ్, గోవర్ధన్, చొక్కాని రామమూర్తి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



తిరుపతి కార్పొరేషన్, మే 31 ప్రభాతవార్త: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 1వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 08772227208కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## వేడుకగా కపిలతీర్థంలో చక్రస్నానం



తిరుపతి, మే 31 ప్రభాతవార్త: తిరుపతి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్స వాలు ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా చక్రస్నాన మహోత్సవంతో పరమపవిత్రంగా ముగిశాయి. కపిలతీర్థం ఆళ్వార్ తీర్థం వద్ద జరిగిన ఈ దివ్య ఘట్టాన్ని వేలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో వీక్షి ంచి పుణ్యఫలాన్ని పొందారు. కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి విచ్చేశారు. మార్గమధ్యంలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారికి ఘన స్వాగతం పలికారు. వివిధ రకాల పండ్లరసాలతో జరిగిన అభిషేకం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. తీర్థంలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు అపార భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

## సర్వభూపాలుడుగా కల్యాణవెంకన్న

### -ఉదయం కల్పవృక్ష వాహనంపై అభయం



తిరుపతి(నారాయణవనం), మే 31 ప్రభాతవార్త: టిటిడి ఆధ్వర్యంలోని నారాయణ వనంలో పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి సర్వభూపాల వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనమిచ్చాడు. స్వామివారే రాజాధిరాజు కావడం విశేషం లేదు. సర్వభూపాలురు తనను సేవించి మోక్షం పొందాలని స్వామి తనభక్తులకు సూచించారు. ఉదయం 8గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు రాజమన్నార్ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై భక్తులకు దివ్య దర్శన మిచ్చారు. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించిన భక్తులు భక్తి పరవశంలో మునిగిపోయారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ వాహనసేవలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్ రాయులు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## మునస్వామి మృతికి... చింతామోహన్ సంతాపం



తిరుపతి హెల్త్, మే 31 ప్రభాతవార్త: స్విమ్స్ ఆస్పత్రిలో నిరుపేద రోగులకు విశిష్ట సేవలు అందించిన డాక్టర్ మునిస్వామి ఆకస్మిక మృతికి కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ప్రజా వైద్యుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న డాక్టర్ మునిస్వామి స్విమ్స్‌లో ఎమర్జెన్సీ విభాగంలో రోగులకు అందుబాటులో ఉంటూ, ప్రేమ పూర్వక, ఆత్మీయ పలకరింపుతో, సేవా దృక్పథంతో వైద్య వృత్తిలో మానవీయ కోణాన్ని చాటి చెప్పారన్నారు. డాక్టర్ మునిస్వామి నైట్ డ్యూటీలో వుండి, ఉదయం 6 గంటల వరకు విధులు నిర్వహించి, తన స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ఈ దుర్ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసారు.

**పేదల డాక్టర్ మునుస్వామి దుర్మరణం తీరని లోటు, ప్రగాఢ సంతాపం**

**- డాక్టర్ మునుస్వామి పార్థవదేహానికి ఘన నివాళులు**

తిరుపతి స్విమ్స్ అత్యవసర విభాగంలో విధులు నిర్వహించే సీనియర్ వైద్యులు, పేద ప్రజలకు విశిష్ట వైద్య సేవలు అందించే పేదల డాక్టర్ మునుస్వామి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం తీరని లోటు బాధాకరమని మాజీ మంత్రి పరసారత్నం, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఎన్ చిన్నబాబులు పేర్కొన్నారు. ఆదివారం మునుస్వామి స్వగ్రామమైన తడ మండలం, మాంబట్టు గ్రామానికి కారులో వెళుతుండగా సూళ్లూరుపేట వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విషాదకరమన్నారు. స్థానిక ప్రజలు డాక్టర్ మునుస్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాలని తెలియగా ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మాంబట్టు గ్రామంలో డాక్టర్ మునుస్వామి పార్థువదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. బాబుయాదవ్, ఉమాపతి రావు, సమరసింహారెడ్డి నివాళులర్పించారు.

## అరాచకాల మయంగా మారిన కూటమి ప్రభుత్వం

### - వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



బాలాయపల్లి, మే 31 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అరాచకాల మయంగా మారిందని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారిపై అక్రమ కేసులు పెడుతున్నట్లు చెప్పారు. దక్కిలి మండలం వేంబులూరు గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారికి చెందిన నిమ్మ చెట్లను పెరికి వేశారని విమర్శించారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. పెరివరం గ్రామం వద్ద వైసిపి వారికి చెందిన పొలంలో కాలువల తవ్వాలని చెప్పారు. అధికారులు అధికార పార్టీ వారికే అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని తెలిపారు. అర్హత లేని వారిని డీఎస్సీ ఎంపిక పెట్టానని చెప్పారు. సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెందోటి కార్తీక్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పూజారి లక్ష్మి కళ్యాణి, శంకరయ్య, నాయకులు దశరథి రామిరెడ్డి రాజారెడ్డి, బండి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ల పంపిణీలో పార్టీ శ్రేణులు భాగస్వామ్యం

### జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి

చిత్తూరు, మే 31 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సోమవారం పంపిణీ చేయనున్న పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడు కుప్పం షణ్ముగం రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పరిధిలో సోమవారం తిరిగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గ, మండల స్థాయి పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జీలు, గ్రామ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు తమ పరిధిలో జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వివరాలను తప్పనిసరిగా మై టిడిపి. కామ్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి కిడ్నాప్

తిరుపతి, మే 31ప్రభాతవార్త: వ్యాపారలావాదేవీల్లో తేడాలతో ఓ రియల్టర్ కిడ్నాప్‌కు గురయ్యాడు. ఈ ఉదంతం తిరుపతిలో సంచలనం రేపింది. తిరుపతి రూరల్ ఎంఆర్‌పల్లి సీతమ్మ నగర్ కు చెందిన రసూల్‌ని కొందరు ప్రత్యర్థులు కిడ్నాప్ చేశారనేది ఫిర్యాదు. ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందకం టీ షాప్ వద్ద శనివారం సాయంత్రం కిడ్నాప్‌కు గురైనట్లు పోలీసులకు అందిన సమాచారం. ఓ రెడ్ శాండిల్ చెట్లు వున్న వెంచర్ ను కడప కు చెందిన వారితో కోట్లతో కొనుగోలు చేసేందుకు వ్యాపారలావాదేవీలు జరిపారు. ఆ స్థలం కొనుగోలు చేసిన వ్యవహారంలో వున్న ఆర్థిక లావాదేవీ లే ప్రధాన కారణం అంటున్న బాధితులు. కడపకు చెందిన మనోహర్ రెడ్డి, ఖాజా పీర్, సుబ్బారెడ్డి, శివకుమార్ కిడ్నాప్ చేశారంటూ బాధితుడు అన్న విశ్రాంత ఏఎస్ఐ ప్రదీప్ ఫిర్యాదు. కేసు నమోదు చేసి ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.




# విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

## పిడియస్‌యు




శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త

విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆదివారం జరిగిన పిడియస్‌యు సమావేశం ధ్వజమెత్తింది. విద్యాశాఖలో సమూల మార్పులు చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఎన్నికల ముందు విద్యారంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ ముఖ్యఅతిధిగా హాజరు కాగా విద్యార్థి సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎస్‌జాకిర్ అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సమావేశంలో జిల్లాలో విద్యార్థులుఎదుర్కొంటున్న సమస్యలను గురించి జిల్లా కార్యదర్శి లోకేష్ జిల్లా నాయకుల దృష్టికి తెచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యువగళం పాదయాత్ర సందర్భంగా నారాలోకేష్ మూసివేసిన 2450 ప్రాథమిక పాఠశాలలను పున: ప్రారంభిస్తామని ప్రకటించారని అయితే వారు అధికారం చేపట్టి ఒరెండేళ్ళు గడిచినా ఒక్క పాఠశాలనుకూడా తెరవలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని వివరించారు. బడి పిలుస్తుంది కార్యక్రమాలకు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తుందని ధ్వజమెత్తారు. తన సొంత నియోజకవర్గంలో తాను అధికారంలోకి వచ్చిన వవెంటనే పిజి విద్యార్థులకు రియంబర్స్‌వమెంట్ దూరం చేసే జిఓ నెంబర్ 77ను రద్దు చేస్తామని చెప్పిన లోకేష్ మాట నీటి మూటగా మారిందని ధ్వజమెత్తారు. ఇప్పటి వరకు విద్యార్థులకురూ.10700కోట్లు ఫీజు రియంబర్స్మంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని విద్యార్థులు పై చదువులు చదుకొవటానికిఆ వరోధంగా మారిందని వివరించారు.ఈ సమావేశంలో అతిధులుగా శివ, భాను తదితరులు పాల్గొన్నారు.

## పాతవీరాపురం జాతరలో సిపాయి

ఏర్పేడు,మే 31 ప్రభాతవార్త



ఏర్పేడుమండలం పాతవీరాపురం గ్రామంలో నిర్వహిస్తున్న అమ్మవారి జాతరలో ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం దర్శించుకున్నారు. ఆదివారం ఆయనతన సహచరులతో గ్రామానికి రాగా అక్కడ గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు.ఈ గ్రామంతో సిపాయికి విడదీయరాని అనుబంధం ఉంది. ఇక్కడ ఎవరికి ఏ ఆపద వచ్చినా తానున్నానని ఆదుకుంటున్న సిపాయికి ఇక్కడ అనుచర వర్గం ఉంది.ఈ నేపధ్యంలో సిపాయి సుబ్రమణ్యం అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపించుకున్నారు. సారె అందించారు.అలాగే గ్రామంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా డాక్టర్‌సిపాయి సుబ్రమణ్యం మెడికల్ క్యాంప్‌నునిర్వహించి వైద్య సేవలందించారు.ఈ సందర్బంగా ఆలయకమిటి సిపాయిని సత్కరించారు.

## వేసవి విజ్ఞాన సదస్సులు సద్వినియోగం చేసుకోండి

తొట్టంబేడు, మే 31 ప్రభతవార్త



శ్రీకాళహస్తి లో జరిగే ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలను ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు . అందులో భాగంగా రిసోర్స్ పర్సన్స్ షణ్ముగం,యుగంధర్, మంజునాథ్ లు విద్యార్థిని విద్యార్థులకు బోధించుచున్నటువంటి ఇంగ్లీషు వేదిక్ మ్యాథ్స్ జనరల్ నాలెడ్జ్ కంప్యూటర్ ఫండమెంటల్ వేదాలు పురాణాలు క్లాస్ ని కాసేపు విద్యార్థులతో పాటు గ్రంథాలయ అధికారి హరికృష్ణ తో కలిసి విన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులతో కాసేపు మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరాలను వారు ఎలా ఉపయోగించుకున్నారని ఈ శిబిరాలలో వారు ఏమి నేర్చుకున్నారని వారి ద్వారా తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయాధికారి హరికృష్ణ ని వేసవిజ్ఞాన శిబిరాలకు హాజరవుతున్న పిల్లల సంఖ్యను తెలుసు కున్నారు. వేసవిజ్ఞాన శిబిరం నిర్వహణ పట్ల సంతృప్తి చెందారు. ఈ మేరకు విద్యార్థిని పి.పూర్ణిమ నూలు వస్త్రంపై ఉల్లన్ తో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని గీయడాన్ని చూసి వారిని అభినందించడం అదేవిధంగా వారికి శుభాకాంక్షలను చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి తెలిపారు. అనంతరం అక్కడే ఉన్న రీడర్స్ తో ప్రత్యేకంగా సమావేశమై చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి వారికి న్యూస్ పేపర్లు బుక్స్ కాంపిటేటివ్ బుక్స్ అందుబాటులో ఉన్నాయా అనే విషయాలు వారి ద్వారా తెలుసుకొని గ్రంథాలయ టైమింగ్స్ కూడా ఏ విధంగా ఉండాలని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేసవి విజ్ఞాన శిబిరమునకు హాజరవుతున్న రిసోర్స్ పర్సన్స్ ,పాఠకులు పాల్గొన్నారు.

## ముచ్చివోలులో ముగిసిన పాండురంగ స్వామి తిరునాళ్ళు

శ్రీకాళహస్తిరూరల్,మే 31 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిమండలం ముచ్చివోలులో పాండురంగ స్వామి తిరునాళ్ళు ముగిసింది. శనివారం అర్ధరాత్రి అగ్నిగుండంతో తిరునాళ్ళుముగిసింది. రుక్మిణి సమేత పాండురంగ స్వామి 66వ అనంద అగ్నిగుండ మహోత్సవం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. అగ్నిగుండ మహోత్సవంకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.ఈసందర్భంగా ప్రత్యేక నృత్యప్రదర్శనలు, భక్తుల భజనలతో దద్దరిల్లింది.ఈ సందర్బంగా విద్యుత్ దీపాలంకరణలతో తీర్చి దిద్దారు. ఈ సందర్బంగా అగ్నిగుండ ప్రవేశానికి యువకులు ఆనందోత్సాహలతో పాల్గొన్నారు.

## జనసేన కార్యక్రమాలపై జనాలకు అవగాహనకల్పించాలి:

నరేంద్ర దండి

శ్రీకాళహస్తి రూరల్,మే 31 ప్రభాతవార్త



జనసేన పార్టీ వ్యవస్థాపకులు కూటమి ప్రభుత్వంలో డెప్యూటి ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ పరిపాలన నిర్ణయాలు ప్రజా రంజకంగా ఉన్నాయని వాటిని మనం క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకుతీసుకెళ్ళాలని నియోజకవర్గంలో అత్యధిక సభ్వత్వాలు నమోదు చేసి పార్టీ అధిష్టానంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిస్థితి పై సమీక్షించిన దండి నరేంద్ర కార్యకర్తలకు దిశ దేశ నిర్దేం చేస్తూ అవగాహనకార్యక్రమాలను నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చివోలు గ్రామంలో ఆయన ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమాలకు నియోజకవర్గంలోని జనసైనికులను ఆహ్వానించారు.ఈ సందర్బంగా ఆయన పార్టీ నిర్ణయాలను వివరించారు.తన పిలుపు మేరకు వచ్చిన నాయకులను నరేంద్ర ఆహ్వానిస్తూ క్రమశిక్షణకు సంబంధించి తెలిపారు.నేడు కూటమిలో నిర్మోహమాటంగా జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ వ్యవహరిస్తున్నారన్నారు.అంతేకాక పార్టీ ప్రతిష్ట కోసం నిరుపేదలకోసం పవన్ కళ్యాణ్ తన సొంత ఆదాయాలను ఎస్తైతం వెచ్చిస్తున్నారన్నారు. నేడు ప్రజల్లో పార్టీకి మద్దతు ఉందని ఈ అంశాన్ని ప్రతి ఒక్కరు ప్రతి కార్యకర్త జనాలకు వివరించాల్సి ఉందన్నారు.పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరు ఆచరించాలన్నారు.రాబోవు రోజుల్లో నిర్వహించే బిఎల్‌ఓల కు సహకరించాన్నారు.

## డియస్‌సిలపై పగబట్టిన మాజీ సిఎం

శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త




తాము అధికారంలో ఉన్న ఐదేళ్ళలో ఒక్క డియస్‌సి కూడా నిర్వహించక నేడు తగుదునమ్మా అని మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి యాగీ చేయటం దారుణమని తెలుగుదేశం నాయకులు శివమెత్తారు. ఆదివారం తెలుగుదేశం కార్యనిర్వాహాక కార్యదర్శి డాక్టర్ యం.ఉ మేష్‌రావు అధ్యక్షతన సమావేశమైన నాయకులుమాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో నానాఇబ్బందులకు గురై అర్ధాకలితో కష్టపడి చదివి నేడు టీచర్ ఉద్యోగాలు సాధించుకున్న నిరుద్యోగ యువతను అవమానించే రీతిలో తప్పుడు ఆరోపణలతో రాక్షసుడిలా విరచుకుపడి పైశాచికానందం పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పగబట్టారని ధ్వజమెత్తారు.కంప్యూటర్ బెస్ట్ టెస్ట్ గురించి ఆవగాహన లేని నాయకుడు జగన్‌రెడ్డి అని శివమెత్తారు. లీక్ అంటూయాగీ చేస్తున్న వైకాపా నాయకునికి డియస్‌సి ప్రశ్నపత్రాలకు సంబంధించి కనీస అవగాహనలేదన్నారు. 6 నుంచి 10మంది నిపుణులు కలిసి ఒక్కొక్క సబెజెక్టుకుసుమారు 3వేల ప్రశ్నలతో ప్రశ్నల బ్యాంక్ సిద్ధం చేస్తారని ఆ ప్రశ్నలు 42వేలు ఉంటాయని వివరించారు. నిపుణులు తయారు చేసిన ప్రశ్నపత్రాలను టిపిఎస్ సర్వర్‌లో అప్‌లోడ్ చేస్తారని వివరించారు. ప్రశ్నల బ్యాంక్‌కుశాశ్వత ఉద్యోగులైన ఇద్దరికిమాత్రమేయాక్సస్ ఉంటుందనే విషయ పరిజ్ఞానం కూడా లేని నాయకుడుమనల్ని ఐదేళ్ళు పరిపాలించాడని తీవ్రంగా విమర్శించారు.ఈ విలేకరుల సమావేశంలో ఆయనతో పాటుమిన్నల్ రవి, బీమాల భాస్కర్,, వజ్రంకిషోర్,కోట చంద్రశేఖర్, మణి,రమేష్, సులేమాన్‌త దితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో ఆర్‌టిఐ కమిషనర్

శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది.ఆంధ్ర ప్రదేశ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ గాజుల ఆదెప్ప కుటుంబసమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.వారికి ఆలయమర్యాదలతో దక్షణ గోపురం వద్ద ఆలయ ఇఓ బికె వెంకటేశులు,ఎఇఓ మోహన్, ఏపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఇఓ వెంకటేశులు అందించారు.

## ముంబాయి వాసుల విరాళం

శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరివిగా విరాళాలు అందుతున్నాయి.ఈ నేపధ్యంలో ఆదివారం ముంబాయికి చెందిన భక్తులుదీపేష్ హర్షవర్ధన్ టిబ్రూవాలా కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత నిత్యాన్నదాన పథకంలో భోజనం చేసిన వారు ఎఇఓ మోహన్‌తో తాము నిత్యాన్నదాన న పథకానికి విరాళం ఇవ్వాలని కోరారు. ఆయన ఇఓ కార్యాలయంలో ఇఓతో సమావేశ పరచారు. నిత్యాన్నదానంలో భోజనం బాగుండటంతో రూ.51వేలు విరాళం అందించారు. ఈమొత్తాన్ని ఇఓ వెంకటేశులుకు అందించారు.వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతోపాటు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## విద్యుత్ ఆధికారుల అలసత్వం - రైతుకు నష్టం

తొట్టంబేడు,మే 31 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంలో విద్యుత్ అధికారుల అలస త్వం,నిర్లక్ష్యంతో రైతులు,ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. నష్టాలు అనుభవిస్తున్నారు. ఈ మండలం లో విద్యుత్ అధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది. మండలంలోని కొత్తకండ్రిగలో రెండేళ్ళుగా ఓ రైతు పొలంలో విద్యుత్ స్థంభం వాలిందని విద్యు త్ అధికారులకు మొరబెట్టుకుంటున్నా పట్టించుకునే దిక్కులేదు. ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని తల్లడిల్లుతున్నారు.ఈ మండలంలో ఆదివారం మరో రైతు ఆవేదన వెలుగు చూసింది. శేషమనాయుడు కండ్రిగకు చెందిన ఓ రైతుకు 12 ఎకరాల వ్యవసాయం ఉంది. ఇక్కడ వరి నాటారు. అయితే విద్యుత్ అధికారుల తీరు రైతుకు శాపంగా మారింది, ఇక్కడ వ ఇద్యుత్ శాఖాధికారులు 11కెవి త్రీఫేస్ విద్యుత్‌లైన్ ఏర్పాటు చేస్తున్న సమయంలో సుమారు 5గుంటల వరి పైరు పూర్తిగా దెబ్బతిన్నట్లు తన ఆవేదనను వ్యక్తం చేసారు. విద్యుత్ లైన్ లాగే సమయంలో పచ్చని పైరును లైన్‌లాగే సమయంలో పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు వివరించారు.దీని వల్లతనకు రూ.20వేలు నష్టం వచ్చిందని వివరించారు. లైన్ లాగే సమయంలో ముందు జాగ్రత్తలు పాటించాల్సిన విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి తానునష్టపోయానని వాపోయారు.

# తిరుపతి డివిజన్



## నేడు పింఛన్ల పండుగ

తొట్టంబేడు మే 31 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు తంగేళ్లపాలెం పంచాయతీ బసవన్న గుంట ఎస్టీ కాలనీలో పెన్షన్ల పంపిణీ సోమవారం జరుగుతుందని మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజనాయుడు అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం లబ్ధిదారుల ఇంటి వద్దకే తెలుగుదేశం పార్టీ సారధ్యంలో వృద్ధులకు, వితంతువులకు నేతన్నలకు,మత్స్యకారులకు వికలాంగులకు,తీవ్ర వ్యాధిగ్రస్తులై కలిగిన కిడ్నీ, లివర్, గుండె వ్యాధిగ్రస్తులకు సచివాల సిబ్బంది వాలంటీర్ల లబ్ధిదారుల ఇళ్ళకి వెళ్లి పెన్షన్ అందజేస్తామని మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ సంబంధించిన నాయకులు ఎండిఓ, సెక్రెటరీ,డిప్యూటీ ఎండిఓ అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## కష్టం వచ్చినపుడు ఆర్‌ఎంపిలు సరైన సూచనలివ్వాలి

ఆర్‌ఎంపి డాక్టర్ల ఆత్మీయ సమావేశం

శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త



మారుమూల ప్రాంతాల్లోనూ, పట్టణాల్లో ఎవరికైనా ఆరోగ్యసమస్య ఏర్పడి ఆర్‌ఎంపి డాక్టర్ల వద్దకు వచ్చినపుడు వారికి సరైన సూచనలు చేసి వైద్యసేవలందించుటకు సహాకరించాలని ఆదివారం జరిగిన ఆర్‌ఎంపి డాక్టర్ల ఆత్మీయ సమావేశంలో సూచనలు చేసారు. ఎంజిఎం ఆసుపత్రి నందు ఆత్మీయ సమావేశాన్ని ఎంజిఎం ఆసుపత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రతి ఏడాది ఇలాంటి సమావేశం నిర్వహించటం తనకు ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని ఆర్‌ఎంపి డాక్టర్లందరని ఒక చోట సమావేశం చేయటం వారు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించటం అలాగే ప్రభుత్వం నుంచి ఆర్‌ఎంపిలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకొని ప్రభుత్వానికి నివేదికలివ్వటం సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఆర్‌ఎంపి డాక్టర్లు ప్రజలకు అందించాల్సిన ఆరోగ్య ప్రయోజనాలను ప్రతి ఆర్‌ఎంపి ఒకే విధంగా అమలు చేయాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో ఎంజిఎం ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వివేక్ చైతన్య డాక్టర్‌ముని రాజ్యలక్ష్మీ,డాక్టర్ కార్తీక్,డాక్టర్ సుమంత్‌లు ప్రజల ఆరోగ్య శ్రేయస్సు మేరకు వారి వద్దకు వచ్చిన రోగులకు సూచనలు,సలహాలివ్వాలన్నారు.ఈ సమావేశంలో శ్రీకాళహస్తి,సత్యవేడు,సూళూరుపేట నియోజకవర్గాల ఆర్‌ఎంపి డాక్టర్లు పాల్గొన్నారు

## సైబర్ నేరాల కట్టడికి మహిళలు 'శక్తి యాప్‌ను'సద్వినియోగించుకోవాలి

తొండమనాడులో మహిళా చైతన్య సదుస్సు

శ్రీకాళహస్తిరూరల్,మే 31 ప్రభాతవార్త



నేడు మహిళలపై జరుగుతున్న నేరాలకు,సైబర్‌నేరాలను కట్టడి చేయటానికి పోలీసు శాఖ రూపొందించిన 'శక్తి యాప్‌ను' వినియోగించుకోవాలని శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి పిలుపునిచ్చారు.శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు 'మహిళల భద్రతపై అవగాహన సదస్సు'ను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు విద్యార్థులు,ఉపాధ్యాయులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డివైయస్‌పి నరసింహామూర్తిమాట్లాడుతూ మహిళలు,బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి నుంచి బయట పడే మార్గాలను వివరించారు. ఆపదలో ఉన్నపుడు డయల్ 100,112,181 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఎసైబర్‌నేరాలు,మహిళలపై జరుగుతున్న దాడులు వేధింపులపై అవగాహన కల్పించారు. ఏపి పోలీసు శాఖ మహిళల భద్రత కోసం 'శక్తియాప్'ను రూపొందించిందని దీనికి సంబంధించి అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ యాప్ పని చేసే విధానాన్ని వివరించారు. ప్రతి మహిళ ఈ యాప్‌నుడౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.ఎస్‌ఓఎస్ బటన్ ద్వారా ఆపద సమయంలో వెంటనే పోలీసులకు సమాచారం చేరుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పోలీసులు మహిళలకు భరోసా కల్పిస్తూ ఏ సమస్య వచ్చినా వెంటనే పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇలాంటి అవగాహన సూచించారు. ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమాలను రూరల్ సిఐ ఇబ్రహీం పర్యవేక్షణలో ఎస్‌ఐ స్వాతి నిర్వహించారు

## అ... ఆలు నేర్పిన గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు




తొట్టంబేడు,మే 31 ప్రభాతవార్త

పసితనంతో అ,ఆలునేర్పిన చిన్న నాటి గురువులను ఆదివారం పూర్వ విద్యార్థులు సత్కరించారు.తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు కలసుకొని ఆనందోత్సాహలతో దినమంతా గడిపారు.ఈ సందర్భంగా వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను చర్చించుకుంటూ గడిపారు.ఈ సందర్బంగా తమకు చిన్ననాట విద్యాబుద్ధులు నేర్పించి నేడు ప్రయోజకుల్ని చేసిన గురువులను సత్కరించాలని భావించారు.ధనలక్ష్మీ, చంద్రయ్య, గౌస్‌మాస్టర్, కృష్ణమనాయుడులను దుశ్శాలువలతో సత్కరించారు. పూల మాలలతోముంచెత్తారు.జ్ఞాపికలను అందించారు. ఈ సందర్బంగా వారు 42 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై రావటం తమకు ఎంతో సంతోషం కల్గించిందన్నారు. ఈ సందర్బంగా నేడు పాఠశాలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ సత్ఫలితాలను సాధించుటకు సహా ఉపాధ్యాయులతో పని చేయిస్తున్న ప్రధానోపాధ్యాయిని లతను సత్కరిచారు. ఈ సందర్బంగా ఆమె బాల్య స్నేహం,బంధం గురించి చక్కగా వివరించారు.ఇదో మధురానుభూతి అని పలువురు వివరించారు.

# భక్తులకు ఆన్‌లైన్ కష్టాలు: సిబ్బందికి తిప్పలు

## శివయ్య ఆదాయానికి గండి



మన మిత్ర వాట్స్‌ప్ ద్వారా టిక్కెట్లు బుక్ చేస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త

లీడ్(శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి శ్రద్దలతో వస్తున్న శివభక్తులకు 'ఆన్‌లైన్ కష్టాలు'తప్పటం లేదు. అయితే భక్తుల నుంచి తిరుగుబాటు రాకుండా ఆలయాధికారులకు సదుపాయాల కల్పన ఆఫ్‌లైన్ ఏర్పాటు తిప్పలు తప్పటం లేదు. ఇక శివయ్యకు ఆదాయాలకు గండి పడుతుంది. ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు రూ.5వేలు, రూ.2500ల రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకొనుటకు వస్తున్నారు.అయితే ఆన్‌లైన్ తిప్పలతో ఏదో ఒకటిక్కెట్టు అంటూ వెళుతున్నారు. దాంతో శివయ్య ఆదాయానికి గండిపడుతుంది. మరి ఈ కష్టాలు,కన్నీళ్ళు, ఇబ్బందులకు పరిష్కారం లేదా?)

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి భావంతో వస్తున్న భక్తులు, ఇక్కడ మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని వస్తున్న వారికి ఆన్‌లైన్ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం అన్ని నసేవలను ఆన్‌లైన్ చేసింది. దాంతో అధికారులు,సిబ్బంది హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు.అయితే ఈ నిర్ణయం తమకు శాపంగా మారుతుందని ఊహించలేక పోయారు. గత వారం రోజులుగా ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది.మూడు రోజులుగా తండోపతండాలుగా భక్తులు వస్తున్నారు.అయితే ఇక్కడకు వచ్చిన తరువాత కానీ వారికి ఇక్కడ అన్‌లైన్‌సేవలని తెలియటం లేదు. అయితే ఆన్‌లైన్ చేసిన తరువాత సర్వర్ల సమస్యలతో సిబ్బందికి ముచ్చెమటలు పడుతుంది.తిరుమలలో కూడా ఆన్ లైన్ విధానమే ఉంది, అయితే ఇక్కడ ఆఫ్‌లైన్ సేవలు కూడా ఉన్నాయి.

**అవగాహన లేక తిప్పలు:**

ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ముందుగా భక్తులకు అవగాహనకల్పించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఎలాంటి ప్రచారం లేకనే హఠాత్తుగా అన్‌లైన్‌సేవలంటూ ప్రకటించారు. వచ్చే భక్తులకు ఈ విషయం తెలియదు. ఇక్కడ వచ్చిన తరువాత భక్తులు ఆలయ సిబ్బందిని సంప్రదిస్తున్నారు.వారు భక్తుల సెల్‌ఫోన్‌లో మన మిత్ర యాప్ లేక కియోస్కో యంత్రాల ద్వారా బుకింగ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియకు కనీసం ఐదు నుంచి 7 నిముషాలు పడుతుంది. దాంతో భక్తులు అసహనానికి గురౌతున్నారు. శివయ్య నీ సేవకు ఇన్ని కష్టాలంటూ పెదవి విరిస్తున్నారు. ఇక అంతసమయం నిలబడటానికి ఓపిక లేని వారు సేవలకు స్వస్తి చెప్పి సర్వదర్శనం చేసుకుంటున్నారు.సర్వర్ డౌన్ అయితే ఆఫ్‌లైన్ సేవలదించుటకు నిర్ణయం తీసుకునేందుకు కనీసం గంట పడుతుంది. ఈ సమయంలో భక్తులు తీవ్ర అసహనానికి గురై తిరుబడుతున్నారు.

**శివయ్య ఆదాయాలకు గండి:**

ఇకశ్రీకాళహస్తీశ్వరుని ఆదాయాలకు గండిపడుతుంది. భక్తులు ప్రత్యేకపూజలు, విపిపి టిక్కెట్లు రూ.5వేలు,రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేయటానికి వస్తున్నారు. అయితే ఇక్కడ సెల్ ఫోన్లో తగినంత మొత్తం లేకపోవటం, ఆన్‌లైన్ కావటంతో రూ.500,రూ.750ల టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నారు.దాంతో శివయ్య ఆదాయాలకు భారీగా గండి పడుతుంది. ఇక కొందరు భక్తులు సెల్‌ఫోన్‌లేకుండా వస్తారు.మరి కొందరికి సెల్‌ఫోన్ ఆపరేట్‌చేయటం రాదు. కొందరుభక్తులకు సోమ్ములుండవు. వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. ప్రభుత్వం దశల వారిగా పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయమంటే దేవాదాయశాఖ కమిషనర్ అత్యూత్సాహంతో అన్ని సేవలను ఆన్‌లైన్ చేయటంతో భక్తులకు తిప్పలు తప్పటం లేదు.

# తిరుపతి డివిజన్

## ప్రశ్నించండి...కానీ నిజాలు వక్రీకరించొద్దు

### -చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఘాటు సమాధానం

తిరుపతిరూరల్, మే 31 ప్రభాతవార్త:



చంద్రగిరి రాజకీయాల్లో వేడెక్కిన తుడా వివాదంపై వైసిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. వరుసగా సోషల్ మీడియాలో వస్తున్న ఆరోఫణలపై ప్రెస్ కాన్ఫరేన్స్ నిర్వహించి, ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తుడాలో అవినీతి జరిగిందంటూ 'రోజుకొక రీల్' సోషల్ మీడియాలో ప్రచారం చేయడం రాజకీయ కుతంత్రం అని మోహిత్‌రెడ్డి మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారానికి ఎమ్మెల్యే పులివర్తి నానినే ప్రధాన కారణమని ఆరోఫించారు.

**ఏసిబి విచారణకు పూర్తి సహకారం**

ఏసిబి, విజిలెన్స్ విచారణలు కొనసాగుతున్న నేపధ్యంలో వాటిపై ప్రభావం చూపకుండా మౌనం పాటిస్తున్నామని స్పష్టం చేశారు. 'ప్రెస్‌మీట్ పెట్టి విచారణను ప్రభావితం చేయడం మా విధానం కాదని, నిష్పక్షపాత విచారణకు మేము పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపారు. 2024 జూలై 6న తన తండ్రి చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి లేఖ రాసి....తమపై ఆరోఫణలపై వివరణ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

2019లో కేవలం 29కోట్ల బడ్జెట్ ఉన్న తుడాను 2024 నాటికి రూ.400కోట్లకుపై పెంచామని చెప్పారు. అది అవినీతి కాదు...అభివృద్ధి దిశగా తీసుకున్న దూకుడు నిర్ణయాల ఫలితం' అని వివరించారు. వేదాంతపురంలో అక్రమ కబ్జాలను కోర్టు ద్వారా తొలగించి... భూములు ప్రజలకు అందజేశామని తెలిపారు. సూరప్పకాశంలో 100 ఎకరాలకు పైగా లే అవుట్ సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. రూ.45కోట్లతో పార్క్ అభివృద్ధి - రోజుకు వేలాది మంది సందర్శన ఉన్నట్లు తెలిపారు. .రూ.75కోట్లతో అవిలాల చెఱువు అభివృద్ధి చేశారు...ఏ మాత్రం అభివృద్ధి చేశారో చూస్తున్నామని ఏద్దేవ చేశారు. తుడాలో రూ.2000కోట్లు అవినీతి జరిగిందన్న ఆరోఫణలను సవాల్ చేస్తూ...ఎవరి ఖాతాలోకి వెళ్లింది? ఎక్కడ ఖర్చుయింది? స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ అథారిటీకి రూ.20కోట్లకుపైగా ఇచ్చిన విధానం ఎమిటో చెప్పాలి'అంటూ కౌంటర్ అటాక్ చేశారు.

**బుక్‌లో 26వ పేజీ చదవండి...క్లారిటీ వస్తుంది**

తాము విడుదల చేసిన పుస్తకంలో అన్ని వివరాలు ఉన్నాయని, ముఖ్యంగా 26వ పేజీలో స్పష్టత ఇచ్చామని చెప్పారు. మిమ్మల్ని ప్రశ్నించండి...కానీ అధికారులను వేధించొద్దు అని విజ్ఞప్తి చేశారు. 'ప్రజల కోసం జైలుకైనా సిద్ధం...వందసార్లు అయినా వెళ్తాం...కానీ వెనక్కు తగ్గం' అంటూ తీవ్ర భావోద్వేగంతో వాఖ్యానించారు. 'ఒక్క రుపాయి కూడా తప్పుగా సంపాదించలేదని... ఆ ఆలోచన కూడా లేదని స్పష్టం చేశారు.

**'కేసులు కొత్తవి కావు...పోరాటం మా ధర్మం'**

తమ కుటుంబంపై గతంలో అనేక కేసులు పెట్టారని అయినా ప్రజల కోసం పోరాటం అపలేదని తెలిపారు. మాతో తేల్చుకోండి...అధికారులను మధ్యలో లాగొద్దు' అని ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. తుడా వివాదం రాజకీయంగా మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకపైపు ఆరోఫణలు... మరోవైపు సవాళ్ళు.....ఈ వ్యవహారం ఏ దిశగా మలుపు తిరుగుతుందో ఇప్పుడు అందరి దృష్టి ఏసిబి విచారణపై నిలిచింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు హేమేంద్రారెడ్డి, కోటాల చంద్ర, దామినేటి కేశవులు, మస్తాన్, కరిమల్ల వల్లి, హరిప్రసాద్, రాజేష్, యశ్వంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి: ప్రొఫెసర్ ఆర్వీఎస్ సత్యనారాయణ




తిరుపతి విద్య, మే 31 ప్రభాతవార్త

సాంకేతిక రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులను అందిపుచ్చుకుని, కాలానుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకున్న వారే భవిష్యత్తులో రాణించగలరని ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్వీఎస్ సత్యనారాయణ అన్నారు.పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వివిధ కోర్సులు, కళాశాలలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు జన విజ్ఞాన వేదిక, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో నిర్వహించిన "ఎడ్యుకేషనల్ గైడెన్స్ " సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.విద్యార్థులు తమ ఆసక్తులు, ప్రతిభ, సామర్థ్యాలకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చేస్తేనే విజయాన్ని అందుకోగలరని పేర్కొన్నారు.సదస్సులో ఐటీకి చెందిన డా. జగదీష్, ఐఐఎస్ఈఆర్‌కు చెందిన వంశీ, అగస్త్య కెరీర్ కన్సల్టెన్సీ వ్యవస్థాపకులు రాధాకృష్ణ వర్మ పాల్గొని వివిధ విద్యా కోర్సులు, ఉన్నత విద్య అవకాశాలు, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు మార్గనిర్దేశం చేశారు. సీఏ, సీఎంఏ, సీఎస్, ఎంబీఏ, ఎల్ఎల్‌బీ, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్ తదితర కోర్సులతో పాటు వాటి ఉద్యోగ అవకాశాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుంకర రెడ్డెప్ప, తిరుపతి బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు దామోదరం, జేవీవీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శతమానం భవతి శుభాకాంక్షలు



శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని విద్యార్థులకు ఆంగ్ల గురువుగా సుపరిచయస్తులైన సెల్వం దంపతుల శతమానం భవతి కార్యక్రమాలు సందర్భంగా పలువురు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సెల్వం సార్‌కు వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శతమానం భవతి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఆంగ్ల లెక్చరర్‌గా ఆయనసుపరిచయస్తులు. ఉపాధ్యాయుడుగా ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఆయన తనస్వగ్రామంలో దేవాలయాన్ని ఏర్పాటు చేసారు. ఆయన ఎంతో నియమనిష్టలతో జీవితాన్ని వ్యవహారిస్తున్నారు.ఆయనకు వంద సంవత్సరాల పండగను ఘనంగా నిర్వహించారు.ఆయనకు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దుశ్శాలువతో సత్కరించారు. ఆయనతో పాటు సుధాకర్‌రెడ్డి, ఉదయగిరి,తేజు, ప్రసాద్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి




శ్రీకాళహస్తి ,మే 31 ప్రభాతవార్త

ప్రభుత్వవిధుల్లో క్రమశిక్షణతో వ్యవహారించాలని పలువురు సూచించారు. శ్రీకాళహస్తికి చెందిన పాలూరు వెంకటరాజుశర్మ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు శ్రీకాళహస్తికి చెందిన పలువురు సత్కరించారు.ఆర్‌టిసి అసిస్టెంట్ మేనేజర్‌గా (పర్సనల్) పని చేసిన వెంకటరాజు తన విధి నిర్వహణలో ఎంతో క్రమశిక్షణతో పని చేసారు. చిరుద్యోగి నుంచి అసిస్టెంట్ మేనేజర్ స్థాయికి ఎదిగారన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో పిజి పాల్, రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమైక అర్చక రాష్ట్ర విభాగం అధ్యక్షుడు నరసింహా మూర్తి,నారాయణ మూర్తి కుటుంబసభ్యులు సత్కరించారు.

## తొందరపడి వరిసాగు చేయవద్దు .. సిఆర్‌డిఎ శాస్త్రవేత్త కెవిరావు

పలమనేరు, మే 31, ప్రభాతవార్త:




రైతులు తొందరపడి వరిసాగు చేయవద్దని సిఆర్‌ఐడిఎ ప్రధాన శాస్త్ర వేత్త కెవిరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై ఆగస్టు నెలల్లో మధ్యంతర కరువు పొంచి వుందని తొలకరి వర్షాలు చూసి రైతులు వరిసాగుకు వెళ్ళవద్దని సూచించారు. నీటి లభ్యతపై స్పష్టత వచ్చిన తర్వాతనే సాగుచేయాల్సిన పంటలు ఎంపిక చేసుకోవాలన్నారు. భారత వాతావరణశాఖ తాజా అంచనాల ప్రకారం రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండక పోవచ్చని తెలిపారు. ఐతే సాధారణ వర్షాలు కురుస్తాయని భావించి రైతులు నీరు ఎక్కువ అయ్యే వరివంటి పంటలు సాగు చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా సాగునీరు అందబాటులో వుంటుందన్న భరోసా ఉన్నపుడే వరిసాగుకు వెళ్ళాలని లేదంటే ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోవాలని సూచించారు. దీనిపై త్వరలో రాయలసీమ,ఉత్తరాంధ్ర జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని శాస్త్ర వేత్తల సిఫార్సులు క్రోడీకరించి వ్యవసాయ శాఖ, డిఎటిటి కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తామని తెలిపారు.

## సౌత్ ఇండియా కురుబ సంఘం అన్నమయ్య జిల్లా నూతన కమిటీ ఎన్నిక



తిరుపతి హెల్త్, మే 31, ప్రభాతవార్త

మదనపల్లి కురుబ కార్యాలయం నందు సౌత్ ఇండియా కురుబ సంఘం అన్నమయ్య జిల్లా నందు సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగిందని, అన్నమయ్య జిల్లాకు సంబంధించి నూతన కమిటీని తెలంగాణకు చెందిన డాక్టర్ కుమార్ రాజా పరిశీలకులుగా వ్యవహరించారన్నారు. అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని సౌత్ ఇండియా కురుబ సంఘం జబ్బల శ్రీనివాసులు తెలిపారు. అన్నమయ్య జిల్లా గౌరవ అధ్యక్షులుగా పి నాగభూషణం, అధ్యక్షులు తరిగొండ ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శులు కొల్లె వేణుగోపాల్, అంకి శెట్టిపల్లి జెసి రెడ్డప్ప, కోశాధికారిగా గోవింద సుధాకర్, గౌరవ సలహాదారులుగా కప్పల వెంకటరమణ, ఆర్కె శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మల్లప్ప, గోవిందు, ఉపాధ్యక్షులుగా ఐదుగురు సభ్యులను, కార్యదర్శులుగా ఆరుగురు సభ్యులను, కమిటీ సభ్యులుగా ఇద్దరినీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లా యువత అధ్యక్షులుగా గుడి శివ, యువత ప్రధాన కార్యదర్శి ఆర్ వినయ్, ఉపాధ్యక్షులుగా రంగా, రాజశేఖర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్ లత, మహిళా ప్రధాన కార్యదర్శులు లలిత,కే మాధవి ఎన్నుకున్నామని, అలాగే మదనపల్లి నియోజకవర్గ కమిటీ గౌరవ అధ్యక్షులుగా రిటైర్డ్ టీచర్ నరసింహులు, అధ్యక్షులు గుడి రామానుజులు, ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, యువత అధ్యక్షులు ప్రభు గౌడ్, యువత ప్రధాన కార్యదర్శి చంద్రను నియమించామన్నారు. వీరందరూ ప్రతి నెల వీరందరూ నియోజకవర్గాలలో మీటింగ్లు నిర్వహించి నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేసి కుల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీలుగా కౌన్సిలర్లుగా సర్పంచులుగా ఎక్కువ స్థానాలలో పోటీ చేసి గెలుపు దిశగా పైనించాలని,ఇప్పటి నుంచే ఆ దిశగా ముందుకెళ్లాలని కోరారు. సౌత్ ఇండియా అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కురుబ కులస్తులను గౌరవించి తిరుపతిలో ప్రభుత్వ రేటుకు 5 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే, కురుబ కులానికి ఒక ట్రస్టును ఏర్పాటు చేసి కురుబ భవన్, కనక మండపం, విద్యార్థుల కోసం కనకదాసు హాస్టల్ నిర్మించుకొని, ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు ఐఏఎస్ ఐపీఎస్ కోచింగులు ఇచ్చి, వాళ్ల ఎదుగుదలకు తోడ్పాటును అందిస్తామని అన్నారు. చుట్టుపక్కల ఐదు రాష్ట్రాలలో కురుబలు ఉన్న ఎక్కడ కార్పొరేషన్ లేవని, గతంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుని, నారా లోకేష్‌ని వెంటపడి వినత పత్రాలు ఇచ్చి కార్పొరేషన్లు సాధించుకున్నామని తెలిపారు.రాబోవు ఎన్నికలలో కురువులను గుర్తించి మదనపల్లి పుంగనూరు పలమనేరు ప్రాంతాలకు సంబంధించి ఎమ్మెల్యే ఎమ్మెల్సీ టికెట్లు కేటాయించాలని, గ్రూపులను గుర్తించి ఏ పార్టీ సీట్లు కేటాయిస్తుందో ఆ పార్టీకి కష్టపడి పని చేస్తామని తెలిపారు. సౌత్ ఇండియా కురుబ ఉపాధ్యక్షులు (అడ్వకేట్) రవిశంకర్ మాట్లాడుతూ కులం మీద ప్రేమతో దక్షిణాది రాష్ట్రాలలోని గ్రూపులను చైతన్యం చేయాలనే ఇండియా కురుబ సంఘం ఏర్పాటు చేశారని, మా నాయకుడు జబ్బల శ్రీనివాసులకు టికెట్టు కేటాయిస్తే మేమంతా కష్టపడి పనిచేసే గెలిపించుకుంటామని, ఆ దిశగా పార్టీలు ఆలోచించాలని కోరారు. ఈ సమావేశంలో కొల్లే రెడ్డి కుమార్, కే రవిశంకర్, తరిగొండ ఈశ్వరయ్య, గుడి శివ, గుడి రామాంజులు, పి శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, జి హరినాథ్, కే.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మునస్వామి మృతికి సిఐటియు తీవ్ర సంతాపం

తిరుపతి హెల్త్, మే 31, ప్రభాతవార్త

పేదల డాక్టర్, రోగులు పిలిస్తే నేనున్నానంటూ పలికే ఉత్తమ వైద్యులు డాక్టర్ కె. మునస్వామి ఆకస్మిక మరణం సమాజానికి, పేద ప్రజలకు తీరని లోటని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నానని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు. సూళ్లూరుపేటలోని వారి సొంత గ్రామానికి వెళుతూ డాక్టర్ మునస్వామి కారులో ప్రమాదానికి గురై ఆదివారం నాటి ఉదయం మరణించారని, అంత్యక్రియలు సూళ్లూరుపేట సమీపంలోని వారి సొంత గ్రామం మాంబట్టులో జూన్ 1వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు జరుగుతాయని, వారి కుటుంబ సభ్యులు తెలియజేసినట్లు కందారపు మురళి తెలిపారు.

### దిగువ పుత్తూరు దళితులకు

## ఇంటి స్థలాలు పంపిణీ చేయండి

### - సీపీఎం డిమాండ్



ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని నిరసన తెలుపుతున్న దిగువ పుత్తూరు గ్రామస్తులు

కేవీబీ పురం, మే 31 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలం దిగువపుత్తూరు దళితులకు సర్వే నెం.61/2లోని ప్రభుత్వ భూమి సుమారు 19 ఎకరాలు ఉండగా అందులో 12 ఎకరాలను గ్రామస్తులు వారి అవసరాల కోసం పోగా మిగిలిన 7 ఎకరాలు భూమిని దళితులకు ఇంటి స్థలాలకు కేటాయించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దిగువ పుత్తూరులోని ప్రభుత్వ భూమిని సీపీఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు స్థానిక దళితులతో కలసి ఆ భూములను సందర్శించారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఒక గ్రామంలోని ప్రభుత్వ భూమి కేవలంఅగ్రకులాల వారికే సొంతమేనా...? దళితులకు గిరిజనులకు హక్కు లేదా...అని ప్రశ్నించారు.సర్వే నెం.61/2పీలో ఉన్న ప్రభుత్వ భూమిని ఇప్పటికే 12 ఎకరాలకు పైగా గ్రామస్తులు ఇంటి స్థలాలకు పాఠశాలకు గిరిజనులు ఇళ్ళస్థలాలకు ఇతర అవసరాలకు కేటాయించుకుని ఉన్నారని గుర్తు చేశారు. మిగిలిన 7 ఎకరాల భూమినైనా దళితులకు వారి భవిష్యత్ అవసరాలకు ఇంటిస్థలాలకు సామాజిక అవసరాల కొరకు సదరు భూమిని దళితులు స్వాధీనంపరచుకుంటే అది తప్పు అయినట్టు గ్రామంలోని అగ్ర కులస్తులు పోలీసులను పిలిపించి దళితులపై దౌర్జన్యంగా ఈ భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని రెవెన్యూ అధికారుల చేత సెక్షన్ 166 బీఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం(గతంలో 145సెక్షన్) విధించి ఎవరిని భూమిలోకి పోనీవ్వకుండా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. చట్టం అధికారులు రాజ్యాంగం ప్రకారం బలహీనులకు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు వారు విధించిన నిషేధపు చట్టం 166ని తొలగించి మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిని ఆ గ్రామంలో అర్హులైన దళితులకు స్వాధీనపరచి ఇంటి పట్టాలను మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవి, గోపి పాల్గొన్నారు.

# హైవే ప్రమాదాలకు నిలయం మాధవరం పోడు గ్రామం

**ఏటా నిరాశ్రయులుగా మారుతున్న 20 కుటుంబాలు**
**అంగవైకల్యంతో పది కుటుంబాలు.. పట్టించుకోని హైవే అధికారులు**

రైల్వే కోడూరు, మే 31 ప్రభాతవార్త.

కడప చెన్నై ప్రధాన రహదారి ప్రమాదాలకు మాధవరం పోడు గ్రామం నిలయంగా మారింది. గత దశాబ్దన్నర కాలం నుంచి ప్రతి ఏటా ప్రమాదాలతో ఈ గ్రామంలో సుమారు 20 మంది మృతి చెంది, ఆ కుటుంబాలు కుటుంబ సభ్యులను కోల్పోయి,కుటుంబ పెద్దలను కోల్పోయి జీవనాధారనకు నిరాధారమై నిరాశ్రయులు అవుతున్నారు. ఇదిలా ఉంటే వీరితో పాటే ఏటా పదిమంది రోడ్డు ప్రమాదాలకు లోనై వికలాంగులుగా కూడా అవయవాలు కోల్పోయి ఉన్న కుటుంబాలు కూడా పదికి పైనే ఉన్నాయి. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలం హైవే రోడ్డు పక్కనే ఉన్న మాధవరం పోడు గ్రామంలో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత హైవే శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వారి నిర్లక్ష్యానికి నాంది పలుకుతుంది. అనుకున్న సమయానికి గమ్యస్థానం చేరేందుకు సురక్షిత ప్రయాణానికి ఆస్ట్రేలియా టెక్నాలజీతో నిర్మించిన హైవే రోడ్డు మాధవరం పోడు గ్రామానికి మృత్యు మలుపుగా మారింది. ఈ ప్రాంతంలో గ్రామంలోని ప్రజలు అడుగు తీసి బయట పెట్టాలంటే హైవే రోడ్డుపైనే పెట్టాలి. హైవే రోడ్డుకు ఇరువైపులా మాధవరం పోడు గ్రామానికి సంబంధించిన ప్రజలు ఇల్లు నిర్మించుకుని తరతరాలుగా జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ గ్రామంలోనే నట్ట నడిమధ్య వెళ్లే హైవే రోడ్డు భారీ ప్రమాదాలకు మలుపుగా ఉంది. దీనికి సంబంధించి సుమారు 20 కిలోమీటర్ల మేర స్పీడ్ బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయలేదు. కోడూరు నుంచి రాజంపేటకు 38 కిలోమీటర్లు దూరం అయితే 42 స్పీడ్ బ్రేకర్లను హైవే రోడ్డుపై అడ్డుకట్టలుగా వేసి ఉన్నారు. అయితే ఇంత దారుణమైన ప్రమాదాలకు నిలయంగా మారి ఏటా ఒకే గ్రామానికి చెందిన 20 మందిని అతివేగంగా వచ్చే వాహనాలు ఢీకొని పొట్టన పెట్టుకోవడమే కాకుండా మరి కొంతమందిని వికలాంగులుగా చేసి మంచాన పడేసిన సందర్భాలు మాధవరం పోడు గ్రామంలో దశాబ్దన్నర కాలం నుంచి మాధవరం పోడు గ్రామం ప్రమాదాలకు మాయని మచ్చగా మారింది. అడ్డు అదుపు లేకుండా కిలోమీటర్కు ఒకటి రెండు చొప్పున గ్రామాలు ఉన్న చోటు అయితే అతి ఎక్కువగా స్పీడ్ బ్రేకర్లు అనుమతి లేకుండా వేస్తుంటే మాధవరం పోడు గ్రామంలో అత్యంత ప్రమాదకరమైన మలుపు అతివేగంగా వెళ్లే వాహనాల స్పీడ్ కు





అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే సంబంధిత శాఖ అధికారులు వీటి పట్ల చర్యలు తీసుకునేందుకు కనీసం కనికరించలేదంటే దారుణం. దీనికి తోడు హైవే రోడ్డు ఆనుకుని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం దానిని రైల్వే శాఖ కొన్ని అనివార్య కారణాలవల్ల నిలిపివేసింది. ఇది మరీ మలుపు వద్ద ప్రమాదానికి నిదర్శనమైంది. గత శనివారం తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న ఒక ద్విచక్ర వాహనం మలుపు వద్ద అదుపుతప్పి రైల్వే అండర్ బ్రిడ్జి కు తవ్విన అతిపెద్ద గొయ్యిలో పడింది. అదే రోజు సాయంత్రం అతి వేగంతో వెళ్తున్న బైక్ గ్రామం లోకి వెళ్తున్న కారును గుద్ది ప్రమాదం జరిగింది. ఈ రెండు ప్రమాదాలలో ప్రాణాపాయం లేనప్పటికీ ప్రతినెల కనీసం ఒక్క యాక్సిడెంట్ అయిన మాధవరం పోడు గ్రామంలో జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాలు నివారించేందుకు గత మూడు సంవత్సరాల నుంచి గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి అనేకమార్లు వాహనాల రాకపోకలను నిలిపి ధర్నాలు చేయడం జరిగింది. అయితే ఆ సమయంలో ఆర్ అండ్ బి హైవే శాఖ అధికారులు పోలీసుల ప్రోత్బలంతో ధర్నాలను నివారించి ప్రమాదాలకు ఆద్యం పోస్తున్న వైనం కూడా రైల్వే కోడూరు పోలీసుల్లో లేకపోలేదు.